ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 16 ఏప్రిల్ 2024



జగనన్న కరెంటేదన్నా..!

మేము అధికారంలోకి వస్తే నిరంతరాయంగా 9 గంటల పాటు రైతులకు నాణ్యమైన కరెంటు ఇస్తాం అని ప్రతి పక్ష నేత హోదాలో పాదయాత్ర సందర్భంగా జగనన్న ఊరూవాడా... గొంతెత్తి ఇచ్చిన మాట.. అయితే జగనన్న ముఖ్యమంత్రి కుర్చీ ఎక్కగానే తాను గతంలో ఇచ్చిన హామీలను మూటకట్టి ఎలా అటకెక్కించాడో ఆ జాబితాలో 9 గంటల విద్యుత్ సరఫరాను కూడా చేర్చారు. దీంతో కరువు జిల్లాగా రాష్ట్రంలోనే పేరుపొందిన అన్నమయ్య జిల్లాలో రైతుల కంట రోజూ కన్నీరు కారుతోంది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి టమోటా పంట సాగు చేసిన రైతులు.. జగనన్నా 9 గంటలు నిరంతరాయంగా కరెంటు ఇచ్చి ఆదుకోమని వేడుకుంటున్నారు..

- కనిపించని నిరంతరాయ కరెంట్
- వ్యవసాయానికి ఏడు గంటలే..
- టమోటా రైతు కంట కన్నీరు
- వర్షాభావంతో ఎండిన 70 శాతం బోర్లు..
- ఉన్న నీళ్లు వాడుకోవడానికీ.. కరెంటు సమస్యలే..
- ధరలున్నా.. దిగుబడి అంతంత మాత్రమే..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఏటా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే కరువు మండలాల జాబితాలో అన్నమయ్య జిల్లాలోని ఎక్కువ మండలాలకు చోటు దక్కుతోంది. దీంతోనే జిల్లాలోని రైతుల దుస్థితి ఏంటో అర్థమవుతుంది. జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులు లేవు. చెరువులు, కుంటలు ఎప్పుడూ నీటి చుక్కలేక నోళ్లు తెరుచుకుని ఉంటాయి. బతుకు మీద ఆశ చావని రైతులు సేద్యమనే జూదం అడుతూనే ఉంటారు. ఇక్కడ సాధారణంగా వర్షాధారంగానే పంటలు సాగు చేస్తారు. అయితే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎక్కువ నీళ్లు అవసరమయ్యే పంటలను కాకుండా ఉన్న కొద్దిపాటి నీటితోనే పండే పంటలు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 15, 20 సంవత్సరాలుగా జిల్లాలో రాయచోటి, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా టమోటాను సాగు చేస్తున్నారు. ఈ టమోటా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 7 గంటల కరెంటు వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. .


సక్రమంగా నీళ్లు అందక వాడుముఖం పట్టిన టమోటా పంట

ఏడు గంటలే.. అది కూడా సక్రమంగా ఇవ్వరు

జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయానికి 7 గంటల విద్యుత్ సరఫరా అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఒక వారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాత్రి 9 గంటల నుంచి 11 వరకు, మరో వారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 6 వరకు, తెల్లవారుజాము 3 గంటల నుంచి 5 గంటల వరకు సరఫరా ఇస్తున్నారు. వేసవి కావడంతో బావులు, బోర్లలో భూగర్భజలాలు అడుగంటాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న పగటి వేళల్లో విద్యుత్ సరఫరా చేస్తుండడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ఉష్ణోగ్రతలకు మోటార్లు కాలిపోవడం కారణంగా అటు పంట నష్టం ఇటు ఆర్థికంగా కర్షకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే సాంకేతిక సమస్యలతో తరచూ అంతరాయం కలుగుతుండడం వలన దిక్కులు చూసుకోవాల్సిన పరిస్థితి తేడవుతున్నదని రైతులు వాపోతున్నారు.

ధరలున్నాయి.. దిగుబడే అంతంతమాత్రం

ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. దిగుబడి మాత్రం అంతంత మాత్రమే ఉందని రైతులు వాపోతున్నారు. తోటల దగ్గర టమోటా కిరీటు (30 కిలోలు) నాణ్యతను బట్టి రూ.550 నుంచి రూ.650 వరకు పలుకుతున్నది. బాగా దిగుబడి వస్తే ఎకరాకు 1500 నుంచి 2 వేల కిరీట్లు వరకు గతంలో దిగుబడి వచ్చేది. అయితే ఇప్పుడు ఎండల తీవ్రత కారణంగా ఎకరాకు 400 నుంచి 700 కిరీట్లు మాత్రమే దిగుబడి రావచ్చని రైతులు వాపోతున్నారు.

ఏడు గంటల కరెంటు సరిపోవడం లేదు



బోరు బావి కింద రెండు ఎకరాల్లో ఇప్పుడు టమోటా సాగు చేశాను. అయితే 20 రోజులుగా ఎండలు ఎక్కువగా ఉండడంతో ఏడు గంటల విద్యుత్ సరిపోవడం లేదు. విద్యుత్ సరఫరా కూడా నిలకడగా లేదు. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. టీడీపీ ప్రభుత్వంలో ప్రతిరోజూ 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా ఉండేది. అంతేగాకుండా 9 గంటలు పూర్తి పగటిపూట విద్యుత్ ఉండేది.

- రెడ్డిశేఖర్., రామసముద్రం

విద్యుత్ కోతలతో పంటకు నీరందడం లేదు



ఒకటిన్నర ఎకరాల్లో టమోటా సాగు చేశా. రూ.1.50 లక్షల వరకు ఖర్చు వచ్చింది. పంట కోతకు వచ్చే సమయంలో విద్యుత్ కోతల వల్ల పంటకు సరిగ్గా నీరు అందడం లేదు. ఏడు గంటలని చెప్పి.. ఆరు గంటలే ఇస్తున్నారు. 9 గంటలు కరెంటు 6 గంటలకు వచ్చింది. దీంతో టమోటా పంటకు నీరు చాలడం లేదు. చేసేది లేక కరెంటు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడాల్సి వస్తోంది.

- చిన్నరెడ్డెప్పరెడ్డి, ములకలచెరువు

కరెంటు ఇబ్బందులు పెడుతోంది..



ప్రతి ఏటా టమోటా సాగు చేస్తున్నా.. 9 గంటలు కరెంటు వస్తుందనే ఆశతో.. రెండు ఎకరాల్లో టమోటాను సాగు చేశా. సుమారు 5 లక్షలు పెట్టుబడులు పెట్టాను. టమోటా తోటకు నీళ్లు సరిపోవడం లేదు. దీంతో బోరును లీజుకు తీసుకున్నాం. అయినా నీళ్లు సరిపోవడం లేదు. దీనికి తోడు కరెంటు 7 గంటలే ఇస్తున్నారు. అది కూడా సక్రమంగా ఇవ్వడం లేదు.

- నాయినేని రెడ్డెప్ప, కేశాపురం, చిన్నమండెం

పేరుకే ఏడు గంటల సరఫరా..



వ్యవసాయానికి ఏడు గంటల విద్యుత్ సరఫరా, పేరుకే పరిమితం. వాస్తవానికి రెండు విడతల్లో సరఫరా అవుతున్న కరెంటు ఏ సమయంలో ఉంటుందో పోతుందో తెలియదు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి టమోటా పంటను సాగు చేశా. వేసవిలో పంట సంరక్షణకు నీటి తడులు చాలా అవసరం. ఇప్పుడేమో భూగర్భజలాలు అడుగంటాయి. దీనికి తోడు విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయి. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు, ప్రస్తుతం కరెంటు సక్రమంగా రావడం లేదు. ఆ దేవుడే మమ్మల్ని కాపాడాలి.

- మద్దిపట్ల వెంకట్రమణనాయుడు, కలకడ

శేషవాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం



శేషవాహనంపై పట్టాభిరాముడి వైభవం

- కన్నుల పండువగా ఊంజల్‌సేవ

వాల్మీకిపురం, ఏప్రిల్ 15: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులను సర్వభూపాల వాహనంపై విశేష అలంకరణలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో యాగశాల వైదిక కార్యక్రమాల అనంతరం ఉత్సవమూర్తులకు వేదపండితులకు మంత్రోచ్ఛారణల నడుమ స్నపనతిరుమంజనం వేడుకగా సాగింది. సాయంత్రం ఆలయ మండపంలో భక్తుల నడుమ రాముడి ఊంజల్‌సేవ కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం రాత్రికి పెద్దశేష వాహనంపై విశేషాలంకృతుడైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడిని పురవీధుల గుండా నగరోత్సవం నిర్వహించగా భక్తులు దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల చలిపిండి దీపారాధనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, భాషికాచార్యులు, రామ్‌గోపాల్ బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, ఊంజల్‌సేవ, రాత్రికి మోహిని అవతారుడైన పట్టాభిరాముడి నగరోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి.

పోలింగ్ ప్రక్రియలో అధికారుల పాత్ర కీలకం

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

రాయచోటి టౌన్, ఏప్రిల్ 15: సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియలో పీవో, ఏపీవోలు, సెక్టోరల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని, కేటాయించిన విధులపై పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ తెలిపారు. సోమవారం రాయచోటి డైట్ స్కూల్‌లో రాయచోటి శాసనసభ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రంగస్వామి ఆధ్వర్యంలో రాయచోటి నియోజకవర్గం పీవోలు, ఏపీవోలు, సెక్టోరల్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోసం నియమించిన పీవోలు, ఏపీవోలు, సెక్టోరల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని వారికి కేటాయించిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో శిక్షణా కార్యక్రమాలు అత్యంత ముఖ్యమని ఎన్నికల్లో పీవోలు, ఏపీవోల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే శిక్షణలో మాస్టర్ ట్రైనర్‌లను అడిగి తెలుసుకోవాలన్నారు. రాయచోటి శాసనసభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రంగస్వామి మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించి కేటాయించబడిన పీవో, ఏపీవోలు, సెక్టోరల్ అధికారులకు ఎన్నికల విధులపై రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఇందులో భాగంగా నేడు మొదటి బ్యాచ్‌కు, రేపు రెండవ బ్యాచ్‌కు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీవోలు, ఏపీవోలు, సెక్టోరల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

- నేటి నుంచి 26వ తేదీ వరకు ఉత్సవాలు
- 22న సీతారాముల కల్యాణం
- ముస్తాబైన ఒంటిమిట్ట కోదండరామాలయం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 15: ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరగనుంది. బ్రహ్మోత్సవాలకు టీటీడీ పటిష్టమైన ఏర్పాట్లను చేపట్టింది. రామాలయంలో చలువపందిళ్లు, ప్రత్యేక క్యూలైన్, మాడవీధుల్లో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఈనెల 16వ తేదీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేయనున్నారు. అంకురార్పణలో స్వామి వారి బ్రహ్మోత్సవాలకు రామాలయంలోని పుట్ట నుంచి పుట్ట మన్ను తీసుకొచ్చి బ్రహ్మోత్సవాలకు హోమగుండంతో అంకురార్పణ చేయనున్నారు. 16 నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు 26 వరకు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను టీటీడీ వైష్ణవ సంప్రదాయం ఆగమశాస్త్ర ప్రకారం వేదపండితులు, టీటీడీ అర్చకులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల కోసం రామాలయం మొత్తం విద్యుద్దీపాలంకరణ, చలువపందిళ్లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు.

రామాలయంలో పోతనకవి సమ్మేళనం

కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి, పోతన జయంతిని పురస్కరించుకుని టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఈనెల 17, 18వ తేదీల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో 17వ తేదీ ప్రముఖ పండితులు శంకర్-భాగవతం ప్రాశస్త్యం, ఎం.నారాయణ రెడ్డి -గజేంద్రుని ఆక్రందన, డాక్టర్ సుమన-మండోదరి హితబోధ, గోపాలకృష్ణ శాస్త్రి-సీతా స్వయంవరం, శివశంకర్-రుక్మిణీ సందేశం, శివారెడ్డి-ఒంటిమిట్ట రామాలయం ప్రాశస్త్యం అంశాలపై కవి సమ్మేళనం జరుగుతుంది. అదే విధంగా ఏప్రిల్ 18వ తేదీ రాంప్రసాద్‌రెడ్డి-ఒంటిమిట్ట కోదండరామాలయ ప్రాశస్త్యం, వెంకటరమణ-హనుమత్ సందేశం, నీలవేణి-రంతు దేవుని చరిత్ర, వెంకటేశ్వర ఆచారి- శ్రీరామలక్ష్మణుల సోదర ప్రేమ, మధుసూదన్-శ్రీకృష్ణలీల, మల్లికార్జునరెడ్డి-జానకి సందేశం, నరసింహులు-రామరాజ్యం, జగన్నాథ్-సుందరకాండ అంశాలపై కవి సమ్మేళనం నిర్వహిస్తారు. కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా 17 నుంచి 25వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బ్రహ్మోత్సవాలలో వాహన సేవలు

కోదండరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం వ్యాసాభిషేకం, సాయంత్రం అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. బుధవారం ధ్వజారోహణం ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల మధ్య మిథున లగ్నంలో నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం శేషవాహనంలో స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. గురువారం ఉదయం వేణుగానాలంకారం, సాయంత్రం హంసవాహనం, శుక్రవారం వటపత్రశాయి అలంకారం, సాయంత్రం సింహవాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. శనివారం ఉదయం నవనీత కృష్ణ అలంకారం, సాయంత్రం హనుమంత వాహనంపై గ్రామోత్సవం, ఆదివారం మోహినీ అలంకారం, సాయంత్రం గరుడ వాహనంపై విహరిస్తారు. సోమవారం ఉదయం శివధనుర్బాలంకారంలో, సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల మధ్య సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం గజవాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మంగళవారం రథోత్సవం నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం కాళికామర్థిని అలంకారంలో సాయంత్రం హంస వాహనంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. గురువారం ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, శుక్రవారం సాయంత్రం పుష్పయాగం, రాత్రికి ఏకాంత సేవలో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.


విద్యుద్దీపాలంకరణలో కోదండరామాలయం

సిద్దవటం, రాజంపేటలలో సుగవాసి అట్టహాసంగా ప్రచారం

రాజంపేట టౌన్/సిద్దవటం, ఏప్రిల్ 15: సిద్దవటం మండలంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం సోమవారం ఉదయం అట్టహాసంగా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాలు కప్పి గజమాలలు వేస్తూ మహిళలు హారతులు ఇస్తూ అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురిని తెలుగుదేశం పార్టీలో చేర్చుకున్నారు. సిద్దవటం మండలంలోని కమ్మపాలెం, జంగాలపల్లె, వెలుగుపల్లె గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే పేద ప్రజలకు అమలు పరిచే ఆరు గ్యారెంటీల పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని, వృద్ధులకు 4 వేలు పెన్షన్లు ఇస్తామని, దివ్యాంగులకు, వికలాంగులకు 6 వేలు పెన్షన్ ఇస్తామని, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు 1500 రూపాయలు మంజూరు చేస్తామని, తల్లికి వందనం కింద ఒక్కో బిడ్డకు రూ.15 వేలు ఇస్తామని తెలిపారు. నిరుద్యోగ భృతి నెలకు 3 వేలు, రైతన్నకు ప్రతి ఏడాది రూ.20వేలు ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు అతికారి దినేష్, రాజంపేట నియోజకవర్గ నాయకుడు పోలి సుబ్బారెడ్డి, మండల టీడీపీ నాయకులు శనివారపు మోహన్‌రెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి నాగమునిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దారపునేని దశరథనాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు జ్యోతి జగదీశ్వర్‌రెడ్డి, యువనాయకులు రాజానాయుడు, పెద్దపల్లి సర్పంచ్ తుర్రా ప్రతాప్‌నాయుడు, నాగం నరసింహారెడ్డి, బజాజ్‌షోరూం అయ్యప్పనాయుడు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చలమయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి యాదవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిద్దవటంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం.. రాజంపేట పట్టణం రాజీవ్‌నగర్‌లో సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రచారం

రాజంపేట పట్టణంలో..

రాజంపేట పట్టణంలోని రాజీవ్ నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున స్థానిక ప్రజలు ఆయనకు స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, అదే విధంగా కూటమి ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు దినేష్, మైనారిటీ నాయకులు అబుబకర్, పీరు సాహెబ్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఇడిమడకల కుమార్, గీతాంజలి కళాశాల కరస్పాండెంటు ఎస్.వి.రమణ, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లనాయుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

లెక్క తేలినా.. చర్యల్లేవ్...

- సహకారంలో స్వాహా రూ.9 లక్షలు పైనే..!
- రికవరీ లేదు.. నిందితులపై చర్యల్లేవ్
- అక్రమాలకు అడ్డాగా సహకార శాఖ


మదనపల్లెలోని సహకార శాఖ డివిజన్ కార్యాలయం

మదనపల్లె, ఏప్రిల్ 15: సహకారశాఖ ఉద్యోగుల సంఘంలో సొమ్ముల స్వాహా జరిగిందని అధికారులు తేల్చారు. పదేళ్లపాటు జరిగిన లావాదేవీల్లో రూ.9లక్షలకు పైగా సంఘానికి చెల్లించాలని విచారణ అధికారులు తేల్చారు. విచారణ పూర్తయి నెలలు గడుస్తున్నా..స్వాహా సొమ్ము రికవరీ లేదు.. నిందితులపై శాఖాపరమైన చర్యలూ లేవు. దీంతో సొంతశాఖలో బాధితులుగా మారిన ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోతున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 30మంది ఉద్యోగులు సంఘంగా ఏర్పడి సొసైటీ ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి ఈ సంఘానికి 2013లో జరిగిన పాలకవర్గమే తప్ప.. తర్వాత కమిటీ ఏర్పాటు చేయలేదు. వర్సన్ ఇన్‌చార్జినీ నియమించలేదు. పాత కమిటీనే అనధికారికంగా కొనసాగుతూ.. కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చింది. నిబంధనల ప్రకారం ప్రతి ఆరునెలలకోసారి సర్వసభ్య సమావేశంతో పాటు ఏటా క్రమం తప్పకుండా ఆడిట్ జరగాలి. అలాగే ఏడాదిలో రెండుసార్లు డీఎల్‌సీవో కార్యాలయ అధికారులు కార్యకలాపాలు, ఆదాయ, వ్యయాలపై విచారణ చేపట్టాలి. కానీ ఎక్కడా ఇది జరగలేదు. అంతా ఎప్పటికప్పుడు సవ్యంగా సాగిందంటూ సొమ్ములు స్వాహా చేశారు. దీనిపై పాలకవర్గం ఏర్పడి నప్పటి నుంచి లెక్కా, బుక్కుతోపాటు విచారణ చేపట్టాలని ఆ సంఘం సభ్యులు చిత్తూరు, అన్నమయ్య జిల్లా సహకారశాఖ అధికారులకు గతేడాది అక్టోబరులో ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన డీసీవో సహకారశాఖ ఉద్యోగులు సంక్షేమ కమిటీపై సెక్షన్ 52 ఎంక్వ యిరీకి ఆదేశించారు.

రాయచోటికి చెందిన సహకారశాఖ సహాయ రిజిస్ట్రార్ ఎస్.హబీవుల్లా, మదన పల్లెకు చెందిన సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఖాసీంసాహెబ్‌లను విచారణ అధికారులుగా నియమిం చారు. ఈ క్రమంలో స్థానిక డీఎల్‌సీవో కార్యాలయంలో వీరిద్దరూ నెలరోజులపాటు విచారణ చేపట్టారు. ఈ సంఘానికి చైర్మన్‌గా వ్యవహరించిన, అభియోగాలు ఎదుర్కొంటున్న ఆడిటర్ రెడ్డెప్పతో పాటు సంఘంలో రుణం తీసుకున్న సభ్యులను సుదీర్ఘంగా విచారించారు. సంఘంలో తీసుకున్న రుణం ఎంత.. ఎంత చెల్లించాలి.. బకాయిలు తదితర వివరాలపై ఆరా తీశారు. సభ్యుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఈ సంఘంలోని మొత్తం 30మంది సభ్యులు ఉండగా, అందులో 20మంది రుణం తీసుకున్నారు. పదేళ్లపాటు వీరిలో కొందరు రుణకంతులు చెల్లించినా.. ఖాతాకు జమ కాకపోవడం, సభ్యులకు తెలియకుండానే వారి పేరు మీద రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు. ఇలా వీరి ఉద్యోగుల సంఘంలో మొత్తం రూ.15 లక్షలు మేర నిధులు ఉండాల్సి వుండగా, అందులో రూ.9లక్షలపైనే స్వాహా అయినట్లు గుర్తిం చారు. మిగిలిన మొత్తంలో కొంత బ్యాంకు ఖాతాలో, మిగిలిన డబ్బులు సభ్యుల నుంచి రావా ల్సి ఉన్నట్లు విచారణ అధికారులు గుర్తించారు. ఇందులో క్యాష్‌బుక్‌లు, ఆడిట్ రిపోర్టు, బ్యాంకుఖాతా, సభ్యుల లోన్ లెడ్జర్‌కు పొంతన లేకపోవడాన్ని విచారణ అధికారులు గుర్తించారు.

సహకారశాఖ అనేది..ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(సింగిల్‌విండో), జిల్లా కేంద్ర సహకారశాఖ బ్యాంకు, పట్టణ కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు, ఇతర సహకార సంఘాల రిజిస్ట్రేషన్, కులవృత్తిదారుల సంఘం, పాలఉత్పత్తి దారుల సహకార సంఘం, గృహ నిర్మాణ సంఘాలు, ఉమ్మడి వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార సంఘం, తదితర సొసైటీల పర్య వేక్షణ అంతా.. సహకారశాఖ ఉద్యోగులే చూస్తుంటారు. వీటి పర్యవేక్షణే కాదు.. నిధుల దుర్వినియోగంపై ఎప్పటికప్పుడు విచారణ, సెక్షన్ 52 విచారణ, ఏటా ఆడిట్ కూడా. ఇలా.. ఎన్నికల నిర్వహణ నుంచి వాటిలో జరిగే అక్రమాలను అరికట్టడం నుంచి చర్యలు తీసుకో వడం వరకూ వీరికే అధికారం ఉంటుంది. అలాంటి ఉద్యోగులే..తమ భవిష్యత్తుకు భరోసా నిచ్చేలా ఏర్పడిన సొసైటీ పరిస్థితే ఇలా ఉంటే.. వీరి పర్యవేక్షణలో సాగే సొసైటీల మనుగడ ఎలా ఉంటుందో ఈ సంఘటన గుర్తుచేస్తోంది. ఇలాంటి కొందరు అధికారులు, ఆడిటర్లు ఉండటంతోనే ప్రస్తుతం సహకార సంస్థలు పీకల్లోతు అప్పుల్లోనే కాదు.. అవినీతి, అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోంది. సహకారశాఖ చట్టంలోని లొసుగులను ఆసరాగా తీసుకున్న కొంద రు మాతృశాఖ ఉద్యోగులు ప్రత్యకంగా, పరోక్షంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. దీనికితోడు ఉన్నతాధికారుల పర్యవేక్షణ, అప్పటికప్పుడు చర్యలు కొరవడటంతో సహకారశాఖ ఉనికినే ప్రశ్నిస్తున్నాయి.

సర్‌చార్జి పూర్తయ్యాక చర్యలు తీసుకుంటాం..

ప్రాథమిక విచారణ పూర్తయింది. సర్‌చార్జి విచారణ జరుగుతోంది. అది కూడా 80శాతం పూర్తయింది. ఆ సంఘం అధ్యక్షుడిగా ఉండి, అభియోగాలు ఎదుర్కొంటున్న రెడ్డెప్ప ఎన్నికల విధుల్లో ఉన్నందున సమయం తీసుకున్నారు. విచారణ అధికారి తేల్చిన నిధులపై ఒకటి, రెండుసార్లు నిందితుడి నుంచి వివరణ తీసుకుంటాం. సర్‌చార్జి పూర్తయిన తర్వాత నిందితునిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు స్వాహా సొమ్ములు రికవరీ చేస్తాం.

- రవిచంద్ర, డీఎల్‌సీవో, మదనపల్లె

మామిడి రైతుకు ఊరట..

● ఆశాజనకంగా ధరలు ● రోజుకు 400 టన్నుల కాయల ఎగుమతి ● పండ్లకు డిమాండ్



కోతకు సిద్ధంగా బేనీషాలు



ఎగుమతి కోసం గోనె సంచుల్లో సిద్ధం చేసిన పచ్చడి కాయలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 15: మామిడి కాయల ఎగుమతులు ప్రారంభమయ్యాయి. పచ్చడికి ఉపయోగించే రుమానీ, పులిహోర, తోతాపురి రకం కాయలను రోజుకు 400 టన్నుల దాకా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో ధరలు భారీగా పెరిగాయి.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో బేనీషా, నీలం, ఇమాంపసంద్, పులిహోరా, తోతాపురి, రుమాని, కాలేపాడు, నూనెపసంద్, రసాలు, మాల్గోవా, రెడ్డిపసంద్, మల్లికా, ఖాదర్ తదితర రకాల మామిడి కాయలను రైతులు పండిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున ఈ ఏడాది 20 శాతం మాత్రమే పంట ఉంది. దీంతో రైతులు, వ్యాపారులు కాయలను యార్డుకు తరలించకుండా నేరుగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కాగా ప్రస్తుతం పండ్లుగా వినియోగించే బేనీషా టన్ను రూ. 60 నుంచి 70 వేలు, పులిహోర రకం టన్ను రూ. 50 నుంచి 55 వేలు, పచ్చడికి ఉపయోగించే తోతాపురి కాయలు టన్ను రూ. 35 నుంచి 40 వేలు, రుమానీ టన్ను రూ. 30 నుంచి 35 వేలు, పులిహోర టన్ను రూ. 25 నుంచి 28 వేలు పలుకుతున్నాయి. ఇమాం పసందు టన్ను రూ. 180 నుంచి 200 పలుకుతున్నాయి. పచ్చళ్లకు వినియోగించే కాయలు ప్రస్తుతం రాజ్‌కోట్, అహ్మదాబాద్, కాన్‌పూర్, బెనారస్, జైపూర్, రాజస్థాన్, ఉదయ్‌పూర్, బిల్వాడ తదితర ప్రాంతాలకు ప్రతి రోజు 20 లారీల్లో పంపిస్తున్నారు. ప్రస్తుతం కాయలతోపాటు, పండ్లకూ డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం పచ్చడి కాయల కోతలు ప్రారంభం కాగా, 15 రోజుల్లో పండ్లు కూడా పూర్తి స్థాయిలో కోతకు సిద్ధమయ్యే పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు. తోటలను చీడపీడల నివారణకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడే పలువురు రైతులు ఈ సారి ఆర్గానిక్ మందులు ఎక్కువగా ఉపయోగించారు. తోటలకు సేంద్రియ ఎరువులు వేయడంతో కాయల రంగు, రుచి, వాసన బాగుంటుందని రైతులు చెబుతున్నారు. కాగా, ఎకరా తోటకు ఎరువులు, మందులు, కూలీలు తదితరాలకు రూ. 50 వేలు ఖర్చు చేశామనీ, ధరలు బాగుండడంతో ఈ ఏడాది ఆదాయం బాగా వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మామిడి సీజన్ లో సుమారు 2 వేల మంది కూలీలకు ఉపాధి కలుగుతుంది. సీజన్ లో కర్నూలు, అనంతపురం, కడప, రాజంపేట, గుత్తి తదితర ప్రాంతాల నుంచి రైల్వేకోడూరు కు వచ్చి జీవనోపాధి పొందుతారు. సీజన్ లో కోట్లాది రూపాయల వ్యాపారం సాగుతుంది.



ఆదాయం బాగా వచ్చే అవకాశాలున్నాయి



ధర ఎక్కువగానే ఉండడంతో ఈ ఏడాది ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో దిగుబడి తగ్గింది. ఉన్న పంటను పలు రకాలుగా కాపాడుకున్నాము. ప్రస్తుతం పచ్చళ్ల రకాలు ఎగుమతి చేస్తున్నాము.

- ఆర్. ఆదాం, రైతు

ఆర్గానిక్ మందులు పిచికారీ చేశాం



ఆర్గానిక్ మందులు పిచికారీ చేశాం. రసాయనిక మందులు వాడకం తగ్గించాం. ప్రస్తుతం పచ్చడి కాయలు కోస్తున్నాం. బేనీషా తదితర రకాలు మార్కెట్ లోకి రావాలంటే సుమారు 15 రోజులు పడుతుంది. ప్రస్తుతం ఆదాయం బాగానే ఉంది.

- వల్లయ్య, రైతు

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

● మృతుడు టీవీఎస్ షోరూం యజమాని ● నుజ్జునుజ్జైన కారు



నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సర్ట్) జయసుబ్బారెడ్డి (ఫైల్‌ఫొటో)

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 15 : టిప్పరు కారును ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతలచెరువుకు చెందిన అంబవరం జయసుబ్బారెడ్డి (48) బద్వే లు పట్టణంలోని మైదుకూరోడ్డులో టీవీఎస్ షోరూం నిర్వహిస్తుంటాడు. సోమవారం తన సతీమణి లక్ష్మీదేవితో కలసి కారులో ప్రొద్దుటూరుకు వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అక్కడి నుంచి బద్వేలుకు తిరిగి వస్తుండగా నంది పల్లె సమీపంలోని దొడ్లడైరీ వద్ద ఎదురుగా వస్తున్న టిప్పరు, ఢీకొంది. దీంతో కారులో ఉన్న జయసుబ్బారెడ్డి ఆయన సతీమణి తీవ్రంగా గాయపడ్డారు. కారు నుజ్జునుజ్జు అయింది. విషయం గమనించిన స్థానికులు కారులో ఇరుక్కుపోయిన జయసుబ్బారెడ్డిని బయటికి తీసి 108 వాహనంలో కడప ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని స్థానిక బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వస్తున్నట్లు సమాచారం, తీవ్ర ంగా గాయపడిన లక్ష్మీదేవి కడపలోని ఓ ప్రైవేటు ఆసు పత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



బాలుడి మృతదేహం

ముద్దనూరు ఏప్రిల్15: విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కొలవలి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. ..కొలవలి గ్రామానికి చెందిన నల్లబల్లె హరిప్రసాద్ (13) తన తండ్రి ఓబులేసు తో కలిసి చీనీ తోట వద్దకు వెళ్లాడు. తోట వద్ద వ్యవసాయ మోటర్‌కు సంబంధించిన స్టార్టర్ తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

అరటి తోట దగ్ధం..



దగ్ధమైన అరటి తోట

పులివెందుల టౌన్, ఏప్రిల్ 15: మండలంలోని ఇ.కొత్తపల్లెలో అరటి పంట దగ్ధం కావడంతో రూ. 4.50లక్షలు నష్టం వాటిల్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. ముచ్చుకుంట్ల ఓబుల్‌రెడ్డి అనే రైతు 2.50 ఎకరాలలో అరటి పంట సాగుచేశారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో అరటి పంటతో పాటు, డ్రిప్ పరికరాలు అగ్నికి ఆహుతైం దని బాధితుడు తెలిపాడు

స్థలం విషయంలో ఇరువర్గాల ఘర్షణ

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 15: మండలంలోని చిన్నఓరంపాడు దిగువపల్లెలో రెండు వర్గాలు ఘర్షణ పడి కత్తులతో దాడులు చేసుకున్నాయి. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గాలినరసింహులు, లక్ష్మీదేవి, వెలకచర్ల చెంగమ్మ, గాలి నాగేశ్వరి, గాలి బాలాజి, గాలి మణెమ్మ తమ ఇంటి ముందు ఉన్న స్థలం విషయంలో శివ, శంకరయ్య, నాగేంద్ర, జ్యోతితో సోమవారం ఘర్షణ పడ్డారు. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకున్నారు. వీరిలో ఒక వర్గం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుండగా, మరో వర్గం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాదరణతోనే కాంగ్రెస్ విజయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 15:కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని, బద్వేలు నియోజవకర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. సోమవారం అయన పోరుమామిళ్లలోని అన్వర్ హాస్పిటల్ ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 9 పథకాలు అమలను చేస్తామన్నారు. కర్ణాటక లో ఐదు పథకాలతో అధికారం లోకి రాగా, తెలంగాణలో ఆరు పథకాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింద న్నారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయజ్యోతి మాట్లాడుతూ రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అవసరం చాలా ఉందని, నియోజకవర్గంలో తనను కడప పార్లమెంటు స్థానానికి షర్మిలారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్సెస్ పార్టీ .జిల్లా మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అన్వర్, సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, రవికుమార్, సీపీఎం నాయకులు భైరవ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు శ్రీను పాల్గొన్నారు.

తపాలా ఏజెంట్లుగా చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

కడప (మారుతీనగర్) ఏప్రిల్ 15: తపాలా శాఖలో భాగమైన తపాలా జీవిత బీమా (పిఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పిఎల్ఐ) ఏజెంట్లుగా కడప డివిజన్‌లోని పలు ప్రాంతాలలో పనిచేయుటకు నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కడప తపాల శాఖ సూపరింటెండెంట్ జి .రాజేష్ సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 29వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించనున్న వాక్ ఇన్ ఇంటర్వ్యూకు వారి తాలూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కడప వన్‌టౌన్ దగ్గర గల ప్రధాన తపాలా కార్యాలయంలో హాజరుకావాలని కోరారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు పదవ తరగతి పాసై, 18 నుంచి 50 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఎంపికైనవారు 5 వేల రూపాయలను కేవీపీ, ఎన్ఎస్‌సీ బాండ్ల రూపంలో సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 08562-243013, 9490032695 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

సేవల్లో నిర్లక్ష్యంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు మెమో

ప్రొద్దుటూరు ఏప్రిల్ 15 : పారిశుధ్యం నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నాలుగు డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి సోమవారం మెమోలుజారీ చేశారు. సోమ వారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన క్లాప్ ఫ్లాప్ కథ నంపై ఆయన స్పందించారు. పట్టణంలో ప్రధాన రోడ్లపై చెత్త కుప్పలు సకాలంలో తరలించకపోవడం, శానిటరీ అధికారుల మధ్య సమన్వయం, సిబ్బందిపై నియంత్రణ లేకపోవడంపై సంజాయిషీ కోరుతూ ఆయన మెమోలు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కురబలకోట, ఏప్రిల్ 15: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పిచ్చలవాండ్లపల్లె ముదివేడు బుర్రాచెరువుకొత్తపల్లెకు చెందిన మహేశ్వర్‌రెడ్డి(20) తన స్నేహితుడు వేణుతో కలిసి మినరల్ వాటర్ తెచ్చుకునేందుకు తన ద్విచక్రవాహనంలో ముదివేడుకు వెళ్ళాడు. అక్కడ వాటర్ క్యాన్‌ను తీసుకుని వస్తుండగా మార్గ మధ్యంలో వారి వాహనం అదుపు తప్పి కిందపడింది. దీంతో తీవ్రంగా గాయపడిన వారిని మదనపల్లె ప్రభు త్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో వేణు చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై ముదివేడు పోలీసులు తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 15: అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందింది. .కురబల కోట మండలం గొడ్డిన్లవారిపల్లెకు చెందిన మంజునాథ్‌కు ఒంటిమిట్టకు చెందిన సుజాతతో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆదివారం సాయంత్రం మంజునాథ్ గొడవ పడటంతో ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించగా సోమవారం ఉదయం తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె సమీపంలోని కుమ్మరపల్లె వద్ద పొలాల్లో ఉరి వేసుకుని మృతి చెంది కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సమస్యలు పట్టించుకోరా?

● అర్జీలు స్వీకరించని తహసీల్దారు ● ప్రజా సంఘాల ఆగ్రహం



తహసీల్దారు కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న అటెండర్

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 15: ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించని ప్రొద్దుటూరు తహసీల్దారు విద్యాసాగర్ వ్యవహార శైలిపై ప్రజా సంఘాలు తీవ్ర అభ్యంతాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం తహసీల్దారు చాంబర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాంబర్ అని, ఇందులోకి ఎవరినీ అనుమతించమని, ఆర్వో కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకు ఎవరినీ అనుమతించమని చెబుతున్నారు. దీంతో ప్రజాసంఘాల నేతలు సోమవారం తహసీల్దారు విద్యాసాగర్‌తో వాదనకు దిగారు. బీసీ బాలిక హాస్టల్ భవనం కూలడానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోకపోగా, ఆ విద్యార్థినుల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడంపై తహసీల్దారుకు వినతి పత్రం సమర్పించేందుకు తహసీల్దారు కార్యాలయం వద్దకు వచ్చిన ప్రజా సంఘాలు, మహిళా సంఘాల నేతలను లోపలికి వెళ్ళడానికి అటెండర్ అడ్డుకున్నా. ఎలాగోలా లోనికి వెళ్లిన వారు సమస్య వివరిస్తుండగా, కలెక్టరుకు తామే నివేదిక పంపామని చెబుతూనే, ఇది ఆర్వో చాంబర్ అని ఇక్కడికి అందరు రాకూడదని గదమాయించారు. అనంతరం, తమకు రామేశ్వరం జగనన్న కాలనీల్లో పట్టా ఇచ్చారని, కానీ నేటికి అది ఎక్కడవుందో చూపించలేదని, . తమతో 35 వేలు డబ్బు కట్టించుకున్నారని, 20 వేలు లోన్‌కూడా తీసుకున్నారని కానీ, ఇంటినిర్మాణం గురించి చెప్పడంలేదంటూ ఫిర్యాదు చేసేందుకు ఓ వృద్ధ జంట కార్యాలయానికి వచ్చింది. వారిని కూడా అటెండర్ అడ్డుకున్నాడు. అక్కడే ఉన్న సీపీఐ నాయకులు రామయ్య, సుబ్బరాయుడు కాంగ్రెస్ నాయకుడు నజీర్‌లు వారిని విచారించారు. ఎందుకు లోపలికి అనుమతించరంటూ అటెండర్‌తో వాదించారు. అనంతరం వారు తహసీల్దారు విద్యాసాగర్‌ను కలిసి పరిస్థితి వివరించగా, ఇది ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంగా మారిందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బయట హెల్ప్‌డెస్కు పెట్టామని అక్కడ సంప్రదించాలని తహసీల్దారు తెలిపారు. దీంతో ప్రజల సమస్యలు తహసీల్దారు స్వీకరించవద్దని ఎన్నికల కమిషన్ తెలిపిందా అని నాయకులు వాదించడంతో, పార్టీ ప్రతినిధులుగా ఉన్న మీకు ఆ మాత్రం తెలియదా అనడంతోపాటు, ఈ అంశాలపై ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేస్తామని తహసీల్దారు సమాధానమిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కోసం తహసీల్దారు కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటుచేయాలని, లేకుంటే జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు.

బీసీ వెల్ఫేర్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

● తహసీల్దారుకు మహిళా, బీసీ, విద్యార్థి సంఘాల వినతి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న బీసీ, మహిళా సంఘాల ప్రతినిధులు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 15 : పాడుబడిన భవనాల్లో వసతి గృహాలు నిర్వహిస్తూ బీసీ బాలికల ప్రాణాలతో చెలగాటమాడిన బీసీ వెల్ఫేర్ అధికారులపై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన చేస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు పాణ్యం సుబ్బరాయుడు, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, విద్యార్థి శక్తి కన్వీనర్ హరిత, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి హెచ్చరించారు. బీసీ వేల్ఫేర్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దారు విద్యాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడుబడిన ప్రైవేటు బిల్డింగ్‌లో దశాబ్దకాలంగా బీసీ బాలికల వసతి గృహం నిర్వహిస్తుండడం ప్రభుత్వం వివక్ష పాటించడమేనన్నారు. నాడు నేడులో భాగంగా జగన్ ప్రభుత్వం బీసీ బాలికల హాస్టల్ భవనాలు ఎందుకు నిర్మించలేదన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యురాలు జింకా భాగ్యమ్మ, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మాడిశెట్టి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

లీజు పేరుతో సీఎస్ఐ స్థలం అన్యాక్రాంతం తగదు

కడప (కల్చరల్) ఏప్రిల్ 15. లీజు పేరుతో సీఎస్ఐ .హైస్కూల్‌లోని 61 సెంట్ల స్థలాన్ని 9 సంవత్సరాల కాలపరిమితికి గాయత్రి కన్‌స్ట్రక్షన్స్ ప్లానర్స్‌కు చెందిన వారికి బిషప్ ఐజాక్ వరప్రసాద్ రిజిస్ట్రేషన్ చేయించడం విడ్డూరంగా వుందని విశ్రాంత పాస్టర్ రెవరెండ్ ఐక్యతరావు, రెవరెండ్ జెకాస్ దేవసహాయం, రెవరెండ్ ప్రేమ్‌సాగర్, రెవరెండ్ ప్రభాకర్, రెవరెండ్ మైఖేల్‌బాబు, రెవరెండ్ బి.వి. మోహన్ అన్నారు. సోమవారం స్థానిక సీఎస్ఐ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా ఆ స్థలంలో నిర్మాణం పనులు చేయడానికి వీలుగా తవ్విన పునాదులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చర్చి ఆఫ్ సౌత్ ఇండియా సీఎస్ఐ) రాయలసీమ డయాసిస్, సీఎస్ఐ ట్రస్ట్ అసోసియేషన్ చెన్నై అనుబంధంతో ఉన్న ఆస్తులను లీజు పేరుతో ఇతరులకు ధారాదత్తం చే సే వీలులేదన్నారు. ఒకవేళ అలా ఇతరులకు లీజుకు ఇవ్వాలనే ఆలోచన వస్తే సంబందిత బిషప్‌తో పాటు ట్రెజరర్, సెక్రటరీలు ముందస్తు ప్రతిపాదన చేసి ఒక్క మాటగా చేయాల్సి ఉంటుందన్నారు.


అంతేగాని అదేదో బిషప్ స్వంత ఆస్తిలాగా ఆయన ఒక్క సంతకంతో గత 2023 జనవరి 17న కడప నగరపాలక సంస్థ నుంచి మార్టిగేషన్ తీసుకోవడం సరైందికాదన్నారు. ఆ సమయానికి బిషప్‌గా అతనికి హక్కులేదన్నారు. దీంతో కడప నగరపాలక సంస్థను కూడా బురిడీ కొట్టించారని ఆరోపించారు. కాబట్టి చట్టప్రకారంగా ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వై. కనకవల్లి, ఎం. ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 15: మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని బి.కొత్తకోట మండలం తానామిట్ట చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బి.కొత్తకోట ఎస్సీ కాలనీకి చెందిన వెంకటరమణ కుమారుడు టి.గోవర్ధన్(27), ఎస్.వెంకటరమణ కుమారుడు ఎస్.నరసింహులు(38) ద్విచక్రవాహనంలో 74 ప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారు. పోలీసులు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి ఇద్దరినీ అరెస్టు చేశారు. బి.కొత్తకోట పట్టణంలో సి.ఓబులేసు కుమారుడు సి. వెంకటేశ్(35) 115 ప్యాకెట్ల కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపామని సీఐ తెలిపారు.

పడకేసిన ఎస్సార్‌బీసీ పనులు

● కాలువ పనులు పూర్తయితే వేల ఎకరాలకు నీరు



కల్లుట్ల గ్రామ సమీపాన నిలిచిపోయిన శ్రీశైలం కుడి కాలువ నిర్మాణ పనులు

మైలవరం, ఏప్రిల్ 15: శ్రీశైలం కుడి కాలువ నుంచి కృష్ణా జలాలను మైలవరం జలాశయానికి తీసుకురావాలన్న కల నేటికీ నెరవేరడం లేదు. నంద్యాల జిల్లా అవుకు జలాశయం నుంచి మైలవరం జలాశయానికి నేరుగా కృష్ణా జలాలను తీసుకు వచ్చేందుకు 2006లో నిర్ణయం తీసుకున్నారు. అంతకు ముందే పేరుసోముల వరకు కాలువ నిర్మించారు. అక్కడి నుంచి మైలవరం జలాశయం వరకు దాదాపు 54 కి.మీ ఉంది. 5 జనవరి 2007లో పనులు ప్రారంభం అయ్యాయి. ఈ మేరకు 36, 37, 38 ప్యాకేజీల్లో రూ.135.49 కోట్లతో కాంట్రాక్టర్లతో ఒప్పందం జరగ్గా, పనులను 2009, జనవరిలోగా పూర్తి చేయాల్సి ఉంది. రూ.75 కోట్ల మేర పనులు పూర్తయిన అనంతరం కొన్ని కారణాలతో కాలువ పనులు నిలిచిపోయాయి. కాలువ పూర్తయితే అవుకు నుంచి మైలవరం జలాశయానికి నేరుగా నీటిని తరలించొచ్చు. గాలేరి నగరి కాలువ ద్వారా గండికోట జలాశయంలోకి నీరు చేరితే అక్కడి నుంచి మైలవరం జలాశయంలోకి నీటిని మళ్లించి నింపుతున్నారు. మూడు ప్యాకేజీల పనులు పూర్తయితే జమ్మలముగు నియోజకవర్గంలో సుమారు 40 వేల ఎకరాలకు లబ్ధి చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు.

ఇప్పటి వరకు జరిగిన పనులు ఇలా..

● 36వ ప్యాకేజీలో నంద్యాల జిల్లా పెద్దముడియం మండలం కొండసుంకేసుల వరకు 12.77 కి.మీ ప్రదాన కాలువ, 40కి.మీ మేర ఉపకాలువ పనులు చేయాల్సి ఉంది. ఇందుకు రూ.38.72 కోట్లు కేటాయించగా, రూ.16 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటి వరకు 12.7 కి.మీ మేర మట్టి పనులు చేశారు. సిమెంట్ పూత పనులు మాత్రం కేవలం 2 కి.మీ చేశారు. ఈ ప్యాకేజీలో 13,500 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది.

● 37 వ ప్యాకేజీ కింద పెద్దముడియం మండలం దిగువ కల్వటాల నుంచి మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె వరకు 16.357 కి.మీ ప్రధాన, 20.45 కి.మీ ఉప కాలువలు నిర్మించాల్సి ఉంది. ఇంతవరకు భూసేకరణ జరగలేదు. ఈ ప్యాకేజీకి రూ.48.40 కోట్లు కేటాయించగా, రూ.27 కోట్లు ఖర్చు చేశారు.

● 38వ ప్యాకేజీ కింద మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె నుంచి మైలవరం జలాశయం వరకు 24.41 కి.మీ ప్రధాన కాలువ, 15 కి.మీ మేర ఉపకాలువలు నిర్మించాల్సి ఉంది. భూసేకరణ జరగకపోవడంతో ఒప్పందం ప్రకారం 2009 జనవరి 21వ తేది నాటికి పనులు పూర్తి కాలేదు. దీంతో మరో ఏడాది పాటు గడువు పొడిగించారు. అయినా కాంట్రాక్టర్లు పనులు చేయలేక చేతులెత్తేయడంతో శ్రీశైలం కుడి కాలువ పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. 2011 ఫిబ్రవరి 14న ఎస్సార్‌బీసీ ఇంజినీర్ల బృందం మైలవరం మండలం బెస్తవేముల ప్రాంతంలో భూసేకరణ కోసం సర్వే నిర్వహించినా ఎలాంటి పురోగతి కనిపించలేదు. ఇప్పటికైనా ఎస్సార్‌బీసీ పనులు పూర్తయ్యేవిధంగా ప్రభుత్వాలు, అధికారులు చొరవ చూపాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


పూజలు చేస్తున్న భక్తులు

పెనగలూరు, ఏప్రిల్ 15: మండలంలోని కంభాలకుంట బీసీ కాలనీ ప్రజల విరాళాలతో నూతనంగా నిర్మించిన రామాలయంలో సోమవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణోత్సవం, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వాముల మూలవిరాట్ల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు ధర్మకర్త నల్లబోయిన వెంకటసుబ్బయ్య, వెంకటలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సింగారెడ్డిపల్లె మాజీ సర్పంచ్ మారంరెడ్డి లక్ష్మీనరయ్య, ఈశ్వరమ్మ దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పరిసర గ్రామాల ప్రజలు భారీగా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా లక్ష్మీనరసయ్య, ఈశ్వరమ్మ దంపతులు ఆళ్లగడ్డ నుండి రూ.60 వేలతో రాతి విగ్రహాలను ఈ దేవాలయానికి సమర్పించారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

నందలూరు, ఏప్రిల్ 15: ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులైన ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంలను గెలిపించాలని కూటమి నాయకులు కోరారు. సోమవారం పాటూరు పంచాయతీ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేయడం తథ్యమని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా పాలక పక్షానికి తీవ్ర వ్యతిరేకత ఉందని, భవిష్యత్తులో ఇటు రాష్ట్రంలో, అటు దేశంలో ఎన్‌డీఏ ప్రభుత్వం రావడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు, టీడీపీ నాయకులు సమ్మెట శివప్రసాద్, ఎద్దల విజయసాగర్, బీజేపీ నాయకులు షబ్బీర్, అహమ్మద్, రాంప్రసాద్, వినోద్‌వర్మ, తోట నాగేశ్వరరావు, జయచంద్రారెడ్డి, ఆకుల చలపతి తదితరులు పాల్గొన్నారు.

'కూటమి అభ్యర్థిని గెలిపిస్తాం'



రైల్వేకోడూరు, ఏప్రిల్ 15: ఎన్డీఏ కూటమి అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేస్తామని కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. ఈయనకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా ఆ పార్టీ అధిష్ఠానం ఆయనకు సోమవారం నియామక ఉత్తర్వులు అందించారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేసినట్లు, పార్టీలో సముచిత స్థానం కల్పించినందుకు నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీకి పట్టు ఏర్పడిందని ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు తెలిపారు. టీడీపీ శ్రేణులందరు కలసి కట్టుగా అభ్యర్థి గెలుపుకోసం ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారన్నారు. కాగా తనకు ఈ పదవి కట్టబెట్టినందుకు విశ్వనాథనాయుడు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పెనగలూరు: రైల్వేకోడూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడును పార్టీ అధిష్ఠానం రాష్ట్ర కార్యనిర్వహక సభ్యుడిగా ఎంపిక చేయడం పట్ల మండల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల పార్టీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జి కె.నాగేశ్వరరావు నాయుడు, జిల్లా అధికార ప్రతినిధికొత్త బాలకృష్ణ, పార్లమెంటు క్లస్టర్ యువత అధ్యక్షుడు ఎన్.రాంప్రసాద్‌నాయుడు, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి ఎస్.షామీర్, వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి ఎన్.మురళీకృష్ణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామ సంప్రదాయాల మేరకే కల్యాణం నిర్వహించాలి

- టీటీడీ అధికారులకు గ్రామస్తుల విన్నపం


టీటీడీ అధికారులకు విన్నవిస్తున్న స్థానిక గ్రామస్తులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 15: కోదండరాముని బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని గ్రామ సంప్రదాయాల ప్రకారమే నిర్వహించాలని గ్రామస్తులు టీటీడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు పామూరు సుబ్రమణ్యం, మామిళ్ల ఈశ్వరయ్య, బీజేపీ మండల నాయకుడు పాటూరు గంగిరెడ్డి ఆధ్వర్యంలో టీటీడీ అధికారులను కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ టీటీడీ అధికారులు సాయంత్రం 6.30 గంటల నుంచి 8గంటల వరకు మార్చడం తగదని, వందల సంవత్సరాలుగా తమ గ్రామ ఆచారం ప్రకారం నిండు పౌర్ణమి రోజున కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. ముందు లాగే రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య నిర్వహించడం కొనసాగుతుందన్నారు. గతంలో కూడా ఆలయ సంప్రదాయం ప్రకారం కాకుండా కల్యాణోత్సవం నిర్వహించడం ద్వారా ఈ ప్రాంతంలో గాలివాన బీభత్సం జరిగిందన్నారు. తమ గ్రామానికి ఇబ్బంది కలుగుతుందని, ప్రతిఏటా ఏ విధంగా కల్యాణం నిర్వహిస్తారో అలాగే నిర్వహించాలని అధికారులకు విన్నవించారు. వారు స్పందిస్తూ.. పై స్థాయి అధికారుల నిర్ణయం మేరకే తాము నడుచుకుంటామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని వారు తెలిపారు. రెండు రోజుల్లో టీటీడీ ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించనున్నారని, ఆ సమీక్షలో తమ అభిప్రాయాన్ని తెలియజేస్తామని టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్ అన్నారు.

రైల్వేకోడూరులో ఇంటింటి ప్రచారం


శ్రీనివాసపురంలో ప్రచారం చేస్తున్న రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 14: మండలంలోని శ్రీనివాసపురం, ఎస్.కొత్తపల్లె, జానకిపురం తదితర గ్రామాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్, జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అభ్యర్థి శ్రీధర్ గెలుపు తథ్యమని, మంచి మెజార్టీ తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వైసీపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. టీడీపీ అమలు చేయబోవు సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వరనాయుడు, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ కో-కన్వీనర్ పగడాల వెంకటేష్, పగడాల చంద్రశేఖర్, మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, ముద్దపోలు సభాపతి, తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: రాష్ట్రాల్లో భూకబ్జాలు సెటిల్మెంట్లు అబద్ధాలతో తాళం గడిపిన వైసీపీ దోపిడీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని కె.కె.వడ్డిపల్లె, సి.కందులవారిపల్లె, తుమ్మచట్లపల్లి, మిట్టపల్లి చిల్లావాండ్లపల్లెలో మండల అధ్యక్షుడు కె.కె.చౌదరితో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ముక్కా సాయి వికాస్‌రెడ్డి, యువ నాయకుడు కాకర్ల నాగార్జున, గుత్తి నరసింహ, అడ్వకేటు బాలాజీ, లారీ సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మండలంలోని చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీలోని కుమ్మరవీధి, గొల్లపల్లి, నడింపల్లి, జ్ఞానంపల్లి హరిజనవాడ, కమ్మపల్లి, కమ్మపల్లి హరిజనవాడ, అయ్యలరాజుపల్లి గ్రామాల్లో ఎన్డీఏ అభ్యర్థి అరవ శ్రీధర్ ఇంటింటికివెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ కార్యక్రమాలను డోర్‌టు డోర్ వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కమ్మపల్లి మాజీ ఎంపీటీసీ రవీంద్రనాయుడు, నాగేంద్రనాయుడు, కోటేశ్వరరావు, గజేంద్ర, ధర్మ, ప్రస్తుత సర్పంచ్ కుమారుడు పెంచలయ్య, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హరిజనవాడల్లో ఇంటింటా ప్రచారం

సంబేపల్లె, ఏప్రిల్ 15: నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ, సోదరీమణులు శ్రీలత, శ్రీవిద్యలు ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం సంబేపల్లె మండలం ఎస్.సోమవరం గ్రామం దేవళంపేట, అగ్రహారం, హరిజనవాడల్లో ఇంటింట ప్రచారం నిర్వహించారు. దేవళంపేటలో శివాలయంలో పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో మండిపల్లి కుటుంబీకులైన దివంగత మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, నారాయణరెడ్డి ఎనలేని సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్యయాదవ్, సర్పంచ్ విశ్వనాథనాయుడు, మాజీ సర్పంచులు నాగేశ్వర్‌నాయుడు, ప్రభాకర్‌నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

200 కుటుంబాలు టీడీపీలో చేరిక

చిన్నమండెం: మల్లూరు వైసీపీ సర్పంచ్ నజీర్ ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలోకి 200 కుటుంబాలు చేరాయి. వీరిని రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని మల్లూరు గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు విచ్చేశారు. రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సమష్టి కృషితో అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు.

రామాపురం: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీలకంఠ్రావుపేట, నల్లగుట్టపల్లె పంచాయతీలోని కొత్తపల్లె, కసిరెడ్డిగారిపల్లె పంచాయతీలోని హరిజనవాడ, తదితర గ్రామాల్లో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఖాళీ బిందెలతో గ్రామస్తుల నిరసన


వడ్డెపల్లెలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 15: వేసవిలో ప్రజల గొంతెండుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రజలకు కాస్తన్ని నీరుచ్చి ప్రజల దాహార్తిని తీర్చాలని ఏపీ దళితమిత్ర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబులేసు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కోనంపేట వడ్డెపల్లె, డి.వడ్డెపల్లె గ్రామాల్లో పర్యటించి తాగునీరుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా మండలంలో తాగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యం చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. వేసవిలో తాగునీరు కోసం వచ్చిన నిధులు ఏం చేశారో ప్రలజకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అరకొర నీటితో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, గ్రామాల్లో వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆయన డిమండ్ చేశారు. లేనిపక్షంలో మండల కార్యాలయం ఎదుట నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

రాజంపేట టీడీపీ నేతలకు పదవులు

- రాష్ట్ర కార్యదర్శిగా కుమార్, అధికార ప్రతినిధిగా అజయ్ భాస్కర్


ఇడిమడకల కుమార్, అజయ్‌భాస్కర్

రాజంపేట, ఏప్రిల్ 15: రాజంపేట టీడీపీ నేతలకు రెండు కీలక పదవుల నిస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా రాజంపేట పట్టణం మన్నూరుకు చెందిన సీనియర్ బీసీ నాయకుడు ఇడిమడకల కుమార్‌ను నియమించారు. అదే విధంగా జిల్లా టీడీపీ అధికార ప్రతినిధిగా కూచివారిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ అమ్మినేని అజయ్‌భాస్కర్‌ను నియమించారు. వీరిని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, బీసీ నాయకుడు, మాజీ కౌన్సిలర్లు ముమ్మడి చిన్నయ్య, గుగ్గిళ్ల చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, రాజంపేట మండలాధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు తదితరులు అభినందించి శాలువాలతో సత్కరించారు.

అంబేడ్కర్ అందరివాడు

- చిట్వేలిలో ఇంటింటికి పుస్తకాల పంపిణీ


పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

చిట్వేలి, ఏప్రిల్ 15: భారతదేశంలో దేశ పౌరుందరికీ ఓటు హక్కు కలిగి ఉండాలని పోరాడిన అంబేడ్కర్ అందరివాడు అయ్యాడని రిటైర్డ్ ప్రిన్సిపల్ ఏలూరు ప్రభుదాస్, శాంతి సేవ సొసైటీ వ్యవస్థాపకుడు మండగలం ప్రసాద్, టీచర్ శోభరాణిలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని ఎగువపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఘనంగా జయంతి వేడుకలు గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ వల్లే సమాజంలో దళితులు అన్ని రంగాల్లో ముందుకెళుతున్నారన్నారు. ప్రస్తుత తరం యువతి, యువకులు అంబేడ్కర్ మార్గంలో పయనించాలని, కష్టపడి చదివి ఉన్నతమైన పదవులను అలంకరించాలని కోరారు. అనంతరం గ్రామంలో అంబేడ్కర్ అందరివాడు అనే పుస్తకాన్ని ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రంగయ్య, సంపత్ కుమార్, రాజగోపాల్, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, వాసు, గంగయ్య, కృష్ణయ్య, నారాయణ, రాజారత్నం, హరి, రవి, మణి, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి మాజీ సర్పంచ్

రైల్వేకోడూరు(రూరల్), ఏప్రిల్ 15: మండలంలోని మాధవరంపోడు మాజీ సర్పంచ్ తన అనుచరులతో సోమవారం టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అలాగే మాజీ ఎంపీటీసీ లక్కిరెడ్డి రామచంద్రారెడ్డి సుమారు 200 మంది వైసీపీ కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మాట్లాడుతూ రైల్వేకోడూరు టీడీపీ అభ్యర్థి శ్రీధర్, పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామాలకు తిరిగి టీడీపీ అమలు చేస్తున్న ఆరు సూత్రాల పథకాల గురించి తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణరాజు, శ్రీనివాసరాజు, గంగరాజు, కంపరాజు సుబ్రమణ్యంరాజు, చంద్రశేఖర్‌రాజు, భూపతిరాజు, తదితరులు ఉన్నారు.

ఆ విద్యుత్ కనెక్షన్ ఆపండయ్యా..!

చిన్నమండెం, ఏప్రిల్ 15: కేశాపురం దేవళంపేటకు చెందిన ఆవుల రమణయ్య అనే రైతు విద్యుత్ కనెక్షన్‌ను నిలిపివేయాలని గ్రామ ప్రజలు మండల విద్యుత్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. వారం రోజుల కిందట అక్కడ విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నారని తెలియడంతో గ్రామస్తులంతా మూకుమ్మడిగా అడ్డు చెప్పడంతో వెనుతిరిగారు. కాగా విద్యుత్ అధికారులు మళ్లీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నారని ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేశారు. అయితే ఈ విద్యుత్ కనెక్షన్ కోసం అగ్రికల్చర్ భూమిలో వోల్టా సర్టిఫికెట్ తీసుకువచ్చి కమర్షియల్ ల్యాండ్ అయిన నడివూరులో విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం సరికాదన్నారు. పాలేటమ్మ జాతర గుడి ఆనుకుని ఈ విద్యుత్ లైన్ వస్తుందని, చాందినీ బండ్లకు తీవ్ర ఆటంకం పలుకుతుందని వారు తెలిపారు. అంతేకాకుండా ఈ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్‌ను చెరువులో ఏర్పాటు చేస్తుండడంతో వర్షాకాలం తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉందని, తక్షణమే ఆపించాలని ఆ వినతిపత్రంలో కోరారు.

టీడీపీతోనే అన్ని వర్గాల వారికి సమన్యాయం

గాలివీడు, ఏప్రిల్ 15: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం మండలంలోని వెలిగల్లు పంచాయతీలో ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, పూలుకుంట సర్పంచ్ పార్థసారధిరెడ్డి, మాజీ వక్ఫ్‌బోర్డు మెంబర్ మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

రేపు రామమందిరాల్లో భజన కార్యక్రమాలు

వేంపల్లె, ఏప్రిల్ 15: శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని వేంపల్లెలోని అన్ని రామమందిరాలలో ఈ నెల 17న భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వృషభాచలేశ్వర భజన మండలి నిర్వాహకులు వెంకటేశ్వర్లు, సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 12 గంటల వరకు భజన కార్యక్రమాలు ఉంటుందన్నారు.

వేడుకగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో భద్రకాళీ అమ్మవారు, వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహాలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 15: దక్షిణకాశీగా పేరుగాంచిన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడు ఉత్సవ విగ్రహాలను అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీ ఉత్సవంపై ఆలయం చుట్టూ మాడవీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చక స్వాములు ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 15: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు భయపడకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ గంగనాథ్ బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్ పేర్కొన్నారు. ఎస్పీ క్రిష్ణారావు ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం కుర్నూతల గ్రామంలో ఎగువవడ్డెపల్లె, దిగువవడ్డెపల్లె, దియ్యలవాండ్లపల్లె, వెంకటరాజుగారిపల్లె, సమస్యాత్మకమైన గ్రామాల్లో కేంద్రబలగాలు, సీఆర్‌పీఎఫ్ కమాండ్ విక్రమ్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు, కొత్త వ్యక్తుల సంచారం, మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే వెంటనే కేసులు బనాయిస్తామన్నారు. రాత్రివేళల్లో నూతన వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బలగాలు, సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

టీడీపీతోనే సామాజిక న్యాయం

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించండి


మాజీ సర్పంచ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రసాద్‌బాబు

సుండుపల్లె, ఏప్రిల్ 15: ఎన్డీఏ కూటమితోనే సామాజిక న్యాయం జరుగుతుందని రాజంపేట పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే బాలసుబ్రమణ్యంలను అఖండ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారాన్ని ఆయన నిర్వహించారు. ముఖ్యమంత్రిగా ఆంధ్ర రాష్ట్రానికి చంద్రబాబునాయుడు ఉంటేనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల కాలంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. అనంతరం చిన్నగొల్లపల్లి మాజీ సర్పంచ్ పెంచలయ్య వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు చప్పిడి రమేశ్‌నాయుడు, శివరామ్‌నాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, వేములయ్య, సురేశ్ నాయుడు, ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరైన భక్తులు

వీరబల్లి, ఏప్రిల్ 15: మండల పరిధిలోని ఓదివీడు పంచాయతీ కావలిపల్లెలో నూతనంగా నిర్మించిన రామాంజనేయస్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు హాజరయ్యారు. క్రోధి నామ సంవత్సరం శుద్ధ పంచమి శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజుల పాటు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, అఖండ దీపారాధన, రక్షాబంధన్, కుంకుమార్చన, పుణ్యాహవచనం, ప్రధాన కులసర్వతోభద్ర మండలాధరన, అభిషేకం, అలంకరణ, నైవేద్యం, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. తిరుపతి దేవస్థానం బ్రహ్మశ్రీ శివకుమార్‌శర్మ గ్రామ పురోహితులు శివరామప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేశారు. అనంతరం ఘనంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు.

పాలకులు.. అభివృద్ధి విస్మరించారు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

సుండుపల్లె, ఏప్రిల్ 15: రాజంపేట అభివృద్ధిని పాలకులు విస్మరించారని, అన్నమయ్య, పింఛా భాగంలో ఉన్న రైతులను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. సోమవారం భాగంపల్లి నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. రాజంపేట సీపీఐ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విశ్వనాథ్‌నాయక్‌కు మద్దతుగా ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ అభ్యర్థి విశ్వనాథ నాయక్, భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లం తాతయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, సాంబశివ, కృష్ణప్ప, శ్రీనివాసులు, కోటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


గ్యాస్ సిలిండర్‌పై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 15: అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సోమవారం లక్కిరెడ్డిపల్లెలో పెట్రోల్‌బంకు, మూడురోడ్ల కూడలిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఇంట్లోని కిచెన్ రూముల్లో గ్యాస్‌లీక్ అయినపుడు మంటలు ఏర్పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, గ్యాస్‌సిలండర్ ఆర్పే విధానం గురించి విన్యాసాలు ద్వారా చూపించారు. పెట్రోల్ బంక్ వద్ద మంటలు ఏర్పడితే ఎలా జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై వివరించారు. అలాగే 101 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



పలమనేరులో జనంతో కలిసి ముందుకు సాగుతూ..



బంగారుపాళ్యంలో షర్మిల సభలో పాల్గొన్న ప్రజలు

కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ సోమవారం కార్వేటినగరంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిర్వహించిన రోడ్డు షోలో పాల్గొన్న జనం



లీసెస్టర్ వర్సిటీతో అపోలో ఒప్పందం



అపోలో, లీసెస్టర్ యూనివర్సిటీల మధ్య కుదిరిన ఒప్పందాన్ని చూపుతున్న ప్రతినిధులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 15: యూకేలోని లీసెస్టర్ యూనివర్సిటీతో చిత్తూరు అపోలో వర్సిటీ ఒప్పందం కుదుర్చుకుంది. లీసెస్టర్‌తో కలిసి అపోలో యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన క్రమంలో సోమవారం ఈ వర్సిటీలు ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా అపోలో వర్సిటీ వీసీ వినోద్‌భట్ మాట్లాడుతూ.. యూకే, భారతదేశాల మధ్య విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడానికి రెండు యూనివర్సిటీలు జతకట్టాయన్నారు. ఇందులో భాగంగా రెండు సంస్థలు ఒక కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు వివరించారు ఈ కార్యక్రమం ద్వారా చిత్తూరులోని అపోలోలో రెండు సంవత్సరాల కోర్సు చేశాక.. చివరి సంవత్సరం లీసెస్టర్‌లో కోర్సును పూర్తి చేసి ఆ యూనివర్సిటీ పేరుతోనే పట్టా పొందవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో విదేశీ విద్యను పొందవచ్చని తెలిపారు. అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మొదటగా 120 మంది విద్యార్థులతో ఈ కోర్సును ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. బోర్డు నుంచి ఎంపీసీ, డిప్లొమా కోర్సులో 50 శాతంమార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు నేరుగా అడ్మిషన్లు పొందవచ్చన్నారు. చదువు కోసం అపోలో సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు. హెల్త్ కేర్, డేటా సైన్స్ రంగాలలో విద్యా, పరిశోధన శక్తిని ఉపయోగించి వాస్తవిక ప్రపంచంలో మార్పులు తీసుకురావాలన్నది తమ భాగస్వామ్య లక్ష్యమని లీసెస్టర్ వీసీ హన్రిట్టా ఓ కానర్ పేర్కొన్నారు. లిసెస్టర్ డిప్యూటీ వైస్ ఛాన్సలర్ కెర్రీలా, అపోలో రిజిస్ట్రార్ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాల అడ్డుకట్టకు బీట్ వ్యవస్థలను బలోపేతం చేయాలి

● జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు



గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 15: నేరాల అడ్డుకట్టకు రాత్రి, పగలు వేళల్లో పోలీస్ సిబ్బంది ద్వారా పర్యవేక్షిస్తున్న బీట్ వ్యవస్థలను ఎప్పటికప్పుడు బలోపేతం చేయాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పోలీస్ అధికారుల ను ఆదేశించారు. గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన రోడ్డుప్రమాదాలు, హత్యలు, హత్యాయత్నాలు తదితర కేసుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసుల వివరాలు, నిందితుల అరెస్ట్, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై ఆరాతీశారు. కేసులను త్వరితగతిన విచారణ పూర్తిచేసి నిర్దేశిత కాలవ్యవధిలో కోర్టులో చార్జిషీట్ ఫైల్‌చేసి నిందితులకు కఠినశిక్షపడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. స్టేషన్లలో పనిచేసి సిబ్బంది సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ తనిఖీలో గంగాధరనెల్లూరు సీఐ శంకర్, ఏఎస్ఐ ఆంజనేయులురెడ్డి, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీయూ దూరవిద్య డిగ్రీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 15: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో గత ఏడాది సెప్టెంబరులో నిర్వహించిన దూరవిద్య డిగ్రీ మొదటి సంవత్సరం (బీఏ, బీకాం, బీఎస్సీ) ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపరిచినట్లు సీఈ దామ్లా నాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సతీష్ (ఫైల్ ఫొటో)

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 15: మదనపల్లె- బోయకొండ మార్గంలోని కృష్ణాపురం సమీపంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం బండ్లపై గ్రామానికి చెందిన గంగులప్ప కుమారుడు సతీష్(25) కూలీ పనులు చేసి కుటుంబాన్ని పోషించేవాడు. ఆదివారం మదనపల్లెకు ద్విచక్రవాహనంలో కూలీ పనులకు వెళ్లి రాత్రి స్వగ్రామానికి వెళుతుండగా కృష్ణాపురం వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి శవపరీక్ష కోసం తరలించారు.

5లీటర్ల నాటుసారా సీజ్



పట్టుబడిన ఊటతో పోలీసులు

పెనుమూరు 15: పెనుమూరు మండలం కామ చిన్నయ్యపల్లి పంచాయతీ మిట్టూరు గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో నాటుసారా తయారీ స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ కథనం మేరకు.. తమకు అందిన సమాచారంతో సోమవారం మెట్రో గ్రామంలోని వ్యవసాయ పొలాల్లో దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా ఐదు లీటర్ల నాటుసారా, సారా తయారీకి సిద్ధంగా ఉన్న 200 లీటర్ల ఊటను స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

దొంగని చితకబాదిన జనం



యువకుడిని కట్టేసి ప్రశ్నిస్తున్న జనం

కుప్పం, ఏప్రిల్ 15: కుప్పం పురపాలక సంఘం పరిధి ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో సోమవారం ఉదయం ఒక మహిళ మెడలోనుంచి ఒక యువకుడు బంగారు గొలుసు దొంగతనం చేయబోయాడు. దీన్ని గుర్తించిన స్థానికులు కొందరు అతడిని పట్టుకుని పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభానికి కట్టేసి చితకబాదారు. అనంతరం పోలీసులకు సమాచారమిచ్చి వారికి అప్పగించారు.

ఎన్నికల వివరాలతో సిద్ధంగా ఉండండి

● లైజన్ ఆఫీసర్లకు జేసీ సూచన



లైజన్ ఆఫీసర్లతో సమీక్షిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 15: జిల్లాకు నియమితులైన ఎన్నికల పరిశీలకులు త్వరలో రానున్నారని, వారికి అవసరమైన ఎన్నికల సమగ్ర వివరాలతో సిద్ధంగా ఉండాలని లైజన్ ఆఫీసర్లను జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం సాయంత్రం జేసీ సమావేశ హాలులో ఎన్నికల పరిశీలకుల నోడల్ ఆఫీసర్, ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డితో కలిసి జేసీ సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికల పరిశీలకులు నియోజకవర్గాల్లో పర్యటించే సమయంలో వారికి సంబంధించి ఎప్పటికప్పుడు వ్యయ వివరాలతో కూడిన నివేదికలను అందజేస్తుండాలన్నారు. ముందస్తుగా ఎన్నికల పరిశీలకులతో వారి రోజువారి పర్యటన వివరాలను తెలుసుకుని ఆ ప్రాంతాలకు వారితో వెళ్లాలని ఆయన సూచించారు.

తగ్గిన టమోటా ధరలు

సోమల, ఏప్రిల్ 15: టమోటా ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. సోమవారం 15కిలోల బాక్సు ధర మొదటి రకం రూ.150, 180 వరకు పలికింది. రెండో రకం రూ.100లోపు, పొడి కాయలు రూ.50లోపు ధరలున్నాయి. దిగుబడులు భారీగా పెరగడం ఇతర ప్రాంతాలకు ఎగుమతులు లేకపోవడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని వ్యాపారస్తులు తెలిపారు. వారం కిందట 15కిలోల బాక్సు రూ.250కి మించి పలికింది. కిలో రూ.10కి చేరుకోవడంతో రైతులు ఆందోళన పడుతున్నారు. సోమల మండలంలో ఒక్కో రైతు 3 నుంచి 10 ఎకరాల వరకు సాగు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి పలువురు వలస రైతులు మండలంలో భూములు లీజుకు తీసుకొని టమోటా సాగు చేశారు. ఎకరా టమోటా సాగుకు రూ. 1.50 లక్షలకు మించి పెట్టుబడులు పెట్టారు. ధరలు తగ్గుముఖం పడుతుండటంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు.

ఏపీ పునర్నిర్మాణం బాబుతోనే సాధ్యం

- ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ పూర్ణచంద్రారావు



కరపత్రాలను విడుదల చేస్తున్న రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ పూర్ణచంద్రారావు తదితరులు

పలమనేరు, ఏప్రిల్ 15 : ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం చంద్రబాబుతోనే సాధ్యమని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ పూర్ణచంద్రారావు పేర్కొన్నారు. సోమవారం పలమనేరులోని మాజీ మంత్రి అమరనాథరెడ్డి స్వగృహంలో బాబుగెలుపు- పెన్షనర్ల పిలుపు పేరుతో కరపత్రాలను అమరనాథరెడ్డి, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ 2014లో రాష్ట్ర విభజన జరిగి రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక లోటు ఉన్నా ఆనాడు చంద్రబాబు 43 శాతం ఫిట్‌మెంట్‌తో 10వ పీఆర్సీ ఇవ్వడం, 10 నెలల పీఆర్సీ అరియర్స్ రూ.2వేల కోట్లు పెన్షనర్లకు చెల్లించారన్నారు. ఉద్యోగులకు రిటైర్‌మెంట్ తేదీకి 15రోజులు ముందుగానే ట్రెజరీలో బిలులు సబ్మిట్‌కు అనుమతించేందుకు ప్రత్యేక జీఓ ఇచ్చి రిటైరు అయిన నాడే పెన్షన్, గ్రాట్యుటీ, కమ్యుటేషన్, గ్రూపు ఇన్సూరెన్సు, జీపీఎఫ్, ఎర్న్‌లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించి సగౌరవంగా ఉద్యోగులను ఇంటికి పంపేవారన్నారు. 2019 నుంచి 2024 మధ్య పెన్షనర్ల పరిస్థితి గమనిస్తే 1వ తేదిన పెన్షన్‌రాక టెన్షన్ పడుతూ 10వ తేది నుంచి 20వ తేది వరకు ఎదురుచూస్తూ పెన్షన్ వస్తే చాలు అనే స్థాయికి వచ్చామన్నారు. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా చంద్రబాబు నేతృత్వంలోని అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ కన్వీనర్ గురవయ్య, కోర్డినేటర్ విస్‌డమ్ చౌదరి, చిత్తూరు జిల్లా అధ్యక్షులు కృష్ణమనాయుడు, పంచాయితీరాజ్ రిటైర్డు ఇంజినీరింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆంజినేయులు, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధానకార్యదర్శి కోదండ యాదవ్, మీడియా కోఆర్డినేటర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపాలి

అధికారం రావడానికి ప్రధాన కారణమైన ఉద్యోగులను కూడా జగన్ రెడ్డి మోసం చేశారని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు జగన్‌ను ఇంటికి సాగనంపితేనే రాష్ట్రభవిష్యత్ సాధ్యమని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులతో పాటు సామాన్యులకు ఇచ్చిన హామీలను జగన్ తుంగలో తొక్కారని, తన మోసపూరిత హామీలతో అందరిని మోసంచేశారన్నారు. నేడు సంక్షోభంలో కూరుకు పోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించడానికి చంద్రబాబును గెలిపించుకోవాలసిన అందరిపై వుందని ఆయన పిలుపు నిచ్చారు.

తీరుమారని రక్త పరీక్ష కేంద్రం సిబ్బంది

● రిపోర్టుల కోసం గంటల తరబడి రోగుల నిరీక్షణ



రిపోర్టుల కోసం నిరీక్షిస్తున్న రోగులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 15 : రుయాస్పత్రిలోని రక్త పరీక్ష కేంద్రం పనితీరు మారడం లేదు. ఇటీవల ఒక రోగికి తప్పుడు నివేదికలు ఇచ్చి విమర్శల పాలైన సిబ్బందిలో ఎటువంటి మార్పూ కనిపించడం లేదు. వైద్యం కోసం వచ్చిన రోగులకు 13 నంబరు గదిలో రక్త పరీక్షలు చేస్తారు. ఉదయం 7 గంటల నుంచి చేసిన పరీక్షల రిపోర్టులను మధ్యాహ్నం మూడులోపు ఇవ్వాలి. వాటిని తీసుకుని రోగులు డాక్టర్లకు చూపించుకుంటారు. అయితే మధ్యాహ్నం 2 గంటల తర్వాత గది తెరిచి 2.30 గంటల లోపు మూసేస్తున్నారు. దీంతో సకాలంలో రిపోర్టులు తీసుకోలేక రోగులు మరుసటి రోజు మళ్లీ రావాల్సి వస్తోంది. సోమవారమూ ఇదే పరిస్థితి కనిపించింది. దీనిపై రుయా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పసిడి పరుగులు

- నెల రోజుల్లోనే గ్రాముపై రూ.1,200 పెరిగింది



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15: బంగారం ధర అమాంతం పెరుగుతోంది. నెల రోజుల వ్యవధిలోనే గ్రాము బంగారంపై రూ.1,200 పెరిగింది. మూడు నెలల వ్యవధిలో 20శాతం పెరుగుదల కనిపించిందని తిరుపతి లోని స్వర్ణ వ్యాపారులు చెబుతున్నారు. మునుపటిలా కాకుండా కరోనా తరువాత ధర పైపైకి ఎగబాకుతూనే ఉంది. 24 క్యారెట్ల బంగాకం నెల కిందట గ్రాము ధర రూ.6,300 ఉండగా, సోమవారం నాటికి రూ.7,500 చేరుకుంది. శుభ ముహూర్తాల వేళ బంగారం ధర పెరగడంపై జనం ఆందోళన వ్యక్తం చేస్తుండగా ఇన్వెస్టర్లు మాత్రం ఖుషీగా ఉన్నారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణమే దీనికి కారణంగా వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. రానున్న రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. జిల్లాలో దాదాపు 430 బంగారం దుకాణాలుండగా అందులో రోజుకు రూ.6.50 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. తిరుపతిలోనే ఏడు కార్పొరేట్ దుకాణాలున్నాయి. చిన్నా చితకా మరో 154 వరకు షాపులున్నాయి. వీటిల్లో మాత్రమే దాదాపు రూ.3.20కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది.

గత ఏడాది ఏప్రిల్‌లో గ్రాము రూ.5,568

గత ఏడాది ఏప్రిల్‌లో గ్రాము బంగారం రూ.5,568 వరకు పలికింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి రూ.1,932 పెరిగి అపరంజి బంగారం ధర రూ.7,500 పలుకుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.6,689 చేరుకుంది. ఇంతలా ధరలు పెరగడంతో కొనుగోలుదారు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి.

టీడీపీ ప్రచార వాహనంపై 'వైసీపీ' దాడి





చిరిగిపోయిన ఫ్లెక్సీతో ఉన్న టీడీపీ ప్రచార వాహనం - ఎస్ఐతో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు

పెళ్లకూరు, ఏప్రిల్ 15: టీడీపీ ప్రచార వాహనంపై వైసీపీ కార్యకర్త దాడి చేశాడు. టీడీపీ నాయకులు తెలిపిన వివరాల మేరకు.. పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు గ్రామంలో సోమవారం ప్రచారం చేస్తున్న టీడీపీ వాహనంపై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త ఆళ్ల నాగార్జున దాడికి దిగాడు. వాహనానికి కట్టి ఉన్న ఫ్లెక్సీలను కర్రతో కొట్టి చించేశాడు. అనంతరం వాహన డ్రైవర్ నెలవల గోపిపైనా కర్రతో దాడికి యత్నించగా, స్థానికులు నిలువరించారు. దాంతో వాహనాన్ని తీసుకుని డ్రైవర్ అక్కడినుంచి తప్పించుకుని వచ్చేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం వెంటనే ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌కు ఫిర్యాదు చేశారు. మరోవైపు డ్రైవర్ కూడా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ గ్రామానికి చేరుకుని విచారించి, నాగార్జున ఆచూకీపై ఆరా తీశారు. సాయంత్రం స్థానిక టీడీపీ నేతలతో కలిసి నెలవల సుబ్రహ్మణ్యం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని దాడికి పాల్పడిన వారితోపాటు అతడిని ప్రోత్సహించిన ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎస్ఐని కోరారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధలను అతిక్రమించి, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎన్నికల నిబంధనల మేరకు కేసు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మౌనికను అభినందించిన కలెక్టర్



చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 15: ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం, జిల్లాలో మొదటి స్థానం సాధించిన కె.ఎం.మౌనికను కలెక్టర్ షన్మోహన్ అభినందించారు. సోమవారం శ్రీవిద్యావికాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మధుమూర్తి, వైస్ ప్రిన్సిపల్ రాజులతో కలిసి మౌనిక కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థినికి కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఇంకా జేసీ శ్రీనివాసులు, కమిషనర్ అరుణ కూడా మౌనికను అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని వివాహిత మృతి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 15: అనుమానాస్పదస్థితిలో ఉరివేసుకుని వివాహిత మృతి చెందిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో సోమవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే..కురబలకోట మండలం గొడ్డిన్లవా రిపల్లెకు చెందిన మంజునాథ్‌కు ఒంటిమిట్టకు చెందిన సుజాతతో మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. ఆదివారం సాయం త్రం మంజునాథ్ భార్య సుజాతతో గొడవపడటంతో మనస్థాపం చెంది ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు చుట్టుప క్కల గాలించగా సోమవారం ఉదయం తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె సమీపంలోని కుమ్మరపల్లె వద్ద ఉన్న వ్యవసాయ పొలాల్లో ఉరి వేసుకుని మృతి చెంది ఉండటాన్ని గమనించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతురాలి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 15: మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలోని గజ్జల కుంటలో కాపురం ఉంటున్న కృష్ణప్ప (54) టమోటా మార్కెట్‌లోని ఓ చెట్టుకు ఆదివారం రాత్రి ఉరివేసుకుని మృతి చెందాడు. సోమవారం స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలం చేరకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన కృష్ణప్ప కాళ్లు భూమికి ఆనుకుని ఉండడంతో పోలీసులు అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నటు టూటౌన్ సీఐ యువరాజ్ పేర్కొన్నారు. అయితే కుటుంబసభ్యులు గత 15 ఏళ్లుగా భాగ్యలక్ష్మి టమోటా మండిలో కార్మికుడు పని చేస్తుండేవాడని, కొద్ది రోజులగా తనకు ఎవరో చెడుపు చేశారని దీంతో ఆరోగ్యం సక్రమంగా ఉండడంలేదని తమతో చెప్పేవారని అన్నారు. ఇతనికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు రాజశేఖర్, అశోక్‌లు ఉన్నారు.

ద్విచక్రవాహనం బోల్తా .. యువకుడు మృతి

కురబలకోట, ఏప్రిల్ 15: ద్విచక్రవాహనం బోల్తాపడి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలో జరిగింది. దీనికి సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పిచ్చలవాండ్లపల్లె ముదివేడు బుర్రాచెరువు కొత్తపల్లెకు చెందిన మహేశ్వర్‌రెడ్డి(20) తన స్నేహితుడితో కలిసి మినరల్ వాటర్ తెచ్చుకునేందుకు తన ద్విచక్రవాహనంలో బయలుదేరి ముదివేడుకు వెళ్లి వాటర్ క్యాన్ తీసుకుని వస్తుండగా మార్గమధ్యంలో వాహనం అదుపు తప్పి వాహనం బోల్తా పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్సల నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా ఈ ప్రమాదంలో అతని స్నేహితుడు వేణు గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై ముదివేడు పోలీసులను అడుగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 15: మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి తెలిపారు. బి.కొత్తకోట మండలం తానామిట్ట చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బి.కొత్తకోట ఎస్సీ కాలనికి చెందిన టి.గోవర్ధన్(27), ఎస్.నరసింహులు(38) ఇద్దరు కలసి ద్విచక్రవాహనంలో 74 ప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తుండగా వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. అలాగే బి.కొత్తకోట పట్టణానికి చెందిన సి. వెంకటేశ్(35) 115 ప్యాకెట్ల కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసి ముగ్గురు నిందితులను రిమాండుకు పంపామని సీఐ చెప్పారు.

రామయ్య కల్యాణోత్సవానికి ఏర్పాట్లు


వాల్మీకిపురంలో కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

వాల్మీకిపురం, ఏప్రిల్ 15: వాల్మీకిపురం పట్టాభిరామాడి బ్రహ్మోత్సవాలలో భాగంగా సీతారాముల కల్యాణోత్సవ వేడుకలకు టీటీడీ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏడాది స్థానిక బైపాస్ రోడ్డులోని టీటీడీ స్థలాలలో భారీ ఏర్పాట్లతో కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుతుంటారు. అయితే అక్కడ ప్రతిఏడులాగే ఏసారి కూడా తాత్కాలిక కల్యాణ వేదిక ఏర్పాటు చేసి సీతారాముల కళ్యాణోత్సవ వేడుకలను నిర్వహిస్తుండడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ వేదిక ఒకటి నిర్మించి ఉంటే ప్రతిఏటా తాత్కాలిక ఏర్పాటు అవసరం లేకుండా ఉంటుందని భక్తులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా సీతారాముల కల్యాణానికి ఓ ప్రత్యేకత ఉందనే చెప్పాలి. ప్రతి ఏటా శ్రీరామనవమి పండుగ మరుసటి రోజు వాల్మీకిపురంలో అమ్మవారి జన్మదిన నక్షత్రం నందు కల్యాణ వేడుకలను జరుపుతుండడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసంవత్సరం అదే శ్రీరామ నవమి పండుగ రోజున కల్యాణోత్సవం కూడా రావడం స్థానికులు భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో 1929వ సంవత్సరంలో ఓ పర్యాయం, తిరిగి 1975లో ఓ సారి శ్రీరామనవమి పండుగ రోజున వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు జరిగినట్లుగా పెద్దల నానుడి. మళ్లీ ఇన్నాళ్లకు అదే శ్రీరామ నవమికి సీతారాముల కల్యాణం జరుగుతుండటంతో భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

టీటీడీ స్థలాలకు దిక్కు లేకుండాపోతోంది..

వాల్మీకిపురం పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల టీటీడీ స్థలాలకు దిక్కులేకుండా పోతోందని సర్వత్రా విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరానికి ఓ పర్యాయం సీతారాముల కల్యాణోత్సవ వేడుకలకు తాత్కాలిక కల్యాణ వేదిక సిద్ధం చేయడం తరువాత వాటిని పట్టించుకోకపోవడంతో ఆ స్థలాలు నిరుపయోగంగా మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు కల్యాణ వేడుకల అనంతరం టీటీడీ స్థలాలను పరిరక్షించే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు పీలేరుకు షర్మిల రాక

పీలేరు, ఏప్రిల్15: ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం పీలేరులో చేపట్టను న్న 'న్యాయ్ యాత్ర'ను విజయవంతం చేయాలని ఎన్ఎస్ యూఐ రాష్ట్ర ఉపాధ్య క్షుడు మద్దెల అమృతతేజ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. షర్మిల యాత్ర ప్రచార పత్రా లను కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ శ్రేణులతో కలిసి సోమమవారం ఆయన ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన 'న్యాయ్ యాత్ర'లో భాగంగా షర్మిల పీలేరుకు రానున్నారని తెలిపారు. పీలేరు క్రాస్ రోడ్డులో మంగ ళవారం ఉదయం 10 గంటలకు షర్మిల ప్రజలను ధ్దేశించి మాట్లాడుతారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయి సంపత్, అతార్ యూసుఫ్ అలీ, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం సాయంత్రం స్థానిక బెంగళూరు బస్టాండ్‌లో నిర్వహించే సభలో పాల్గొంటారని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లెల పవన్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు జరిగే సభలో రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, మాజీ మంత్రి రఘువీ రారెడ్డి, తులసిరెడ్డి. ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగిస్తారన్నారు. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేంద్రరెడ్డి, లక్ష్మీపతి, నాగరాజు, కళ్యాణ్, సీపీఐ నేత మురళి, సీపీఎం కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి మంగళవారం బి. కొత్తకోటలో పర్యటించనున్నారు. సాయంత్రం 6.00 గంటలకు ఆమె బి కొత్తకోట చేరుకుని స్థానిక జ్యోతిచౌక్‌లో జరిగే రోడ్‌షోలో ప్రజల నుద్దేశించిప్రసంగించనున్నారు. షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ అభ్యర్థి ఎంఎన్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రజలను కోరారు.

పోలీసులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 15: విధి నిర్వహణలో ఒత్తిడి, శారీర కంగా అలసిపోకుండా పోలీసులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మదనపల్లె టు టౌన్ సీఐ యువరాజు పేర్కొ న్నారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆదేశాలతో టు టౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీసులు, అధికారులకు సోమవారం ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి పోలీసు సిబ్బంది ఖచ్చితంగా ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్యపరీక్షలు, రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యులు ఇచ్చే ఆరోగ్యసూత్రాలు పాటిస్తూ, ఆహార నియమాలు, యోగా, వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి ఎంఎస్ డాక్టర్ పద్మాంజలి దేవి, టు టౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరుపై అవగాహన పెంచుకోవాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 15: ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులు(పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు(ఏపీవో) ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల పనితీరు పై అవగాహన పెంచుకోవాలని ఆర్డీవో హరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో పీవోలు, ఏపీవోలకు ఆర్డీవో పలు సూచనలిచ్చారు.

ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రోజున పీవోలు, ఏపీవోలకు ఈవీ ఎంలు, వీవీప్యాట్‌లు, సీయూలు పంపిణీ చేస్తార న్నారు. ఏవైనా ఈవీ ఎంలు మరమ్మతుకు గురైతే సెక్టోరియల్ అధికారికి సమాచారం ఇచ్చి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌క్యాస్టింగ్ వుంటుందని ఎన్నికల నిర్వహణ పక్షపాతం లేకుండా సమర్థవంతంగా నిర్వహించాన్నారు.

వేడుకగా చౌడేశ్వరిదేవి ఊరేగింపు

కలకడ, ఏప్రిల్ 15: కలకడ మండలం కోటగుడిబండలో చౌడేశ్వరిదేవి ఉత్సవాలలో భాగంగా తొగటవీర క్షత్రీయ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని సింహప్రభ వాహనంపై వేడుకగా ఊరేగించారు. పుష్పపల్లకిని రంగు రంగుల దీపాలతో అలంకరించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు పలకలు, జ్యోతుల ఊరేగింపు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, యువకులు కేరింతలతో పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. కోటగుడిబండ గ్రామంతోపాటు పక్క గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకోన్నారు. గ్రామానికి చెందిన పలువురు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

బలిజలు ఐక్యంగా ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపించాలి


మదనపల్లె సమావేశంలో మాట్లాడుతున్న వంగవీటి రాధ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 15: బలిజలు ఐక్యంగా ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపించా లని కాపునాడు నేత వంగవీటి రాధ పేర్కొ న్నారు. సోమవారం స్థానిక సీఎస్ఐ కమ్యూ నిటీ హాల్‌లో జనసేన నేత శ్రీరామాంజనేయులు, రామాచార్లపల్లె యుగంధర్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన బలిజ, కాపు రాజకీ య సమావేశానికి బలిజలతోపాటు టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాపుసామాజికవర్గ నాయకుడు వంగవీటి రాధ మాట్లాడుతూ రాష్ట్రంలో దోపిడీ పాలన చేసి దాచుకుంటున్న వైసీపీని సాగనంపాలని సంఘ నేతలను, ప్రజలను కోరారు. జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, తెలుగు యువత శ్రీరాం చినబాబు మాట్లాడుతూ జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అసెంబ్లీ కూటమి అభ్యర్థులను గెలిపిం చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మదనపల్లె టీడీపీ బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి ఎం షాజహాన్‌బాషా, టీడీపీ నాయకులు విద్యాసాగర్, దొరస్వామినాయు డు, రాట కొండ మధుబాబు, కత్తి లక్ష్మన్న, మాజీ సర్పంచ్ మోహన, నాగూర్‌వలి, గిరీషా, బీజేపీ నాయకుడు కిరణ్‌కుమార్, జనసేన నాయకులు జంగాల శివరాం, అడపా సురేంద్ర, బలిజ సంఘం నాయకులు కోసూరి రామమూర్తి, రాయల్ గణి, బోర్‌వెల్ నాగరాజ, రమణ, శ్రీనివాసులు, రవీంద్ర, మురళి, మహర్షి, పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం

నిమ్మనపల్లి/మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 15: బీసీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయమని మదన పల్లె కూటమి ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక నిమ్మన పల్లిలో జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీసీలు టీడీపీకి పట్టుకొమ్మ లని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే నిమ్మనపల్లి-కందూరు రోడ్డు, తాగునీటి సమస్య, ప్రతి పేదవా డికి ఇళ్లను మంజూరు చేస్తామని హమీఇచ్చారు. కార్రక్రమంలో మల్లప్ప, రాజన్న, శ్రీపతి, మహమ్మద్ రఫి, రెడ్డెప్ప, జయన్న, మల్లికార్జున, రెడ్డెప్ప, రమణ, షఫీ, ఖాసింఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ సంఘం మద్దతు స్థానిక పెన్షనర్స్ సంఘం నాయకులు సోమవారం టీడీపీ కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషాను తన స్వగృహంలో కలిసి మద్దతు ప్రకటించారు.

కూటమితోనే ప్రత్యేక బీసీ రక్షణ చట్టం

● జయహో బీసీ సదస్సులో జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్


బీసీ డిక్లరేషన్ చూపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 15: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం లోకి రాగానే బీసీల అభ్యున్నతికి ప్రత్యే క రక్షణ చట్టం అమలు చేస్తామని తంబళ్లపల్లె జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని జుంజురపెంటలో జయహో బీసీ డిక్లరేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ..బీసీ డిక్లరేషన్‌తో బీసీల సమగ్రాభివృద్ధితో పాటు సంరక్షణ ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు, నిరుద్యోగభృతి, బీసీ రక్షణచట్టం తదితర పథకాలు అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ జయహో బీసీ పరిశీలకుడు తులసీధర్ నాయుడు సూపర్ సిక్స్ పథకాలతో పాటు బీసీ డిక్లరేషన్ గురించి వివరించారు. టీడీపీ యువ నాయకుడు శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ..వైసీపీ ఐదేళ్ల పాలనలో తంబళ్లపల్లెను అన్ని విధాలా దోచుకున్నారని విమర్శించారు. విజన్ ఉన్న నాయకుడు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జయచంద్రారెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గంలో రైతులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లతో పాటు యువతకు ఉద్యోగాలు కల్పించేలా పరిశ్రమలు ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. అరాచక పాలన పోయి..తంబళ్లపల్లె అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే సైకిల్‌కు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డిని గెలిపించడంతోపాటు కమలం గుర్తుకు ఓటేసి ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ప్రధానకార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, మంత్రి గిరిధర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరిశీన, యూనిట్ ఇన్‌చార్జులు బీఎంఆర్, కాలానారాయణ, సోముశేఖర్, గ్రామాధ్యక్షుడు తేజమూర్తినాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, తెలుగుయువత నరసింహులు, మహిళా నాయకురాలు సిద్ధమ్మ, వీరాంజినేయులు, వెంకటరెడ్డి, జనసేన నాయకులు ఎద్దుల నరసింహులు, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టి కృషి అవసరం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్

ములకలచెరువు, ఏప్రిల్ 15: ఎన్నికల్లో రాజం పేట పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డితోపాటు అసెంబ్లీ అభ్య ర్థుల విజయానికి సమష్టి కృషి చేయా లని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ పిలుపు నిచ్చారు. ములక లచెరు వులో సోమవారం ఆయన బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డితో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ నియోజకవర్గంలోని 236 పోలింగ్ కేంద్రాలను 40 శక్తి కేంద్రాలుగా విభజించడం జరిగిందన్నారు. శక్తి కేంద్రాల పరిధిలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు కార్యకర్తలను నియమించామ న్నారు. అనంతరం మండలాల వారీగా సమీక్షలు నిర్వహించారు. కార్య క్రమంలో పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జి సురేష్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి చంద్రమౌళి, రాష్ట్ర స హకార సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల కృష్ణమూర్తి, అసెంబ్లీ కన్వీనర్ మంగరాజు, కో కన్వీనర్ శంకర్‌రెడ్డి, మం డల అధ్యక్షులు జయరామిరెడ్డి, శంకర, రామదాసు, భాస్కర్‌రెడ్డి, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు పిల్లస్వామినాయక్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పీలేరు, ఏప్రిల్ 15: అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీలేరు అగ్నిమాపక శాఖ అధికారి మస్తాన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా స్థానిక రైల్వే స్టేషన్‌లో అగ్నిప్రమాదాలు, వాటి నివారణ, ఎదుర్కొనే విధానాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగి తే వెంటనే 101కు సమాచారం అందించాలని తెలిపా రు.

ఆకట్టుకున్న అగ్నిమాపక విన్యాసాలు

ములకలచెరువు, ఏప్రిల్ 15: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సోమవారం సిబ్బంది నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. స్థానిక మార్కెట్ యార్డు, బస్టాండు సర్కిల్ తదితర ప్రాంతాల్లో విన్యాసాలు నిర్వహించి అగ్నిప్రమాదాలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం పై కేసు నమోదు

బి. కొత్తకోట, ఏప్రిల్15: ఓ వివాహిత అదృశ్యం పై కేసు నమోదు చేసినట్టు బి.కొత్తకోట సీఐ సూర్యనారాయణ సోమవారం తెలిపారు. మండలంలోని బీరంగి పంచాయతీ వత్రోల్లపల్లెకు చెందిన సిరీష(24) ఈ నెల 12 నుంచి కనపడడం లేదని ఆమె తండ్రి వెంకట్రమణప్ప పోలీసులకు ఫిర్యాదు చేశా డు. ఆ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

బి.కొత్తకోట, ఏప్రిల్15: మండలంలోని గట్టు పంచాయతీ పత్రవారిపల్లెకు చెందిన రైతు కె.అమరనాథ్ సోమవారం పాముకాటుకు గురయ్యాడు. ఉదయం పొలంవద్దకు వెళ్లి వ్యవసాయ పనుల్లో నిమగ్న మై వుండగా ఓ పాము కాలి కి కాటేసింది. దీనిని గమ నించిన రైతు వెంటనే కుటుం బీకులకు సమాచారం ఇచ్చా డు. వారు అప్రమత్తమై 108 లో మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇద్దరు అరెస్ట్.. సారా స్వాధీనం

నిమ్మనపల్లి, ఏప్రిల్ 15: గుట్టు చప్పుడు కాకుండా నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి 30 లీటర్ల నాటుసారాను స్వాధీ నం చేసుకొన్నట్లు ఎస్ఐ లోకే శ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాచవేటివారిపల్లి పంచాయ తీకి పిల్లి నారాయణ(45) పిల్లి రెడ్డిశేఖర(50)లు గ్రామంలో నాటు సారా విక్రయిస్తుండగా తన సిబ్బందితో దాడి చేసి నాటు సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

మైనారిటీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం


గుర్రంకొండలో టీడీపీలో చేరిన నాయకులతో కిశోర్‌కుమార్‌రెడ్డి


పీలేరులో ప్రచారం చేస్తున్న నల్లారి తనూజా రెడ్డి, కుమార్తె వైష్ణవీ రెడ్డి

గుర్రంకొండ, ఏప్రిల్ 15:తెలుగుదేశం పార్టీ హయాంలోనే ముస్లీం మైనారిటీలకు పలు సంక్షేమ పథకాలు అందాయని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమారెడ్డి పేర్కొన్నారు. గుర్రంకొండ పట్టణంలోని బజారు వీధి, తాళంవీధి, సంత బజారు, ఆసుపత్రి మార్గంలో సోమవారం బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ నిర్వహించారు. ఈ క్రమంలో ఆయనకు ప్రజలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం రాగానే టీడీపీ ప్రవేశ పెట్టిన మైనారిటీ పథకాలను పూర్తిగా రద్దు చేసిందన్నారు. దీంతో నిరుపేద ముస్లీంలు ప్రభుత్వ లబ్ధి అందక తీవ్రఇబ్బందులు పడుతునట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికు డిలా పని చేసి టీడీపీ గెలుపుకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, నౌషాద్ అహ్మద్, ఏజాజ్ అహ్మద్, నక్కా సతీష్, వై.ఆర్వీ.ప్రసాద్‌నాయుడు, నక్కా బాలాజి, హరిప్రసాద్‌నాయుడు, మురళీ, మహాత్మారెడ్డి, చంద్రబాబు, చలమారెడ్డి, జ్యోతిరెడ్డి, సుబ్బరాజు, నాగరాజు విజయ్‌కుమార్, రెడ్డెప్ప, వెంకటరమణ, రామాంజులు, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

మండలంలోని నడిమిఖండ్రిగ పంచాయతీ వరపనవాండ్లపల్లెకు చెందిన వైసీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, నవీన్, సుధాకర్, పాల శేఖర్‌రెడ్డి, చింతలవారిపల్లెకు చెందిన చింత భాస్కర్‌రెడ్డితోపాటు మరో పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారందరికీ కిశోర్‌కుమార్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డిశేఖర్, కేవీ, హరియాదవ్, శ్రీనివాసులు, సురేష్‌బాబు, సుధాకర్, మధు, రమణ తదితరులు పాల్గొన్నారు.

మైనారటీల రక్షణ బాధ్యత టీడీపీదే!

పీలేరు, ఏప్రిల్ 15: మైనారిటీల రక్షణ బాధ్యత టీడీపీ తీసుకుంటుందని నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పీలేరు పట్టణానికి చెందిన రియల్టర్, సామాజిక సేవా కార్యకర్త ఆతిఖా షఫీ సోమవారం రాత్రి కిశోర్ కుమార్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆతిఖా షఫీతోపాటు ఆయన బంధువులు, అనుచరులకు కిశోర్‌కుమార్‌రెడ్డి కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నల్లారి అమరనా థరెడ్డి, కలికిరి సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్‌రెడ్డి, నేతలు శ్రీహరి రెడ్డి, కోటపల్లె బాబు రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రెడ్డిబాషా, పురం రామ్మూర్తి, ఎన్టీఆర్ నఫీస్, పాల్గొన్నారు.

కూటమితో మహిళలు మహారాణులు కాగలరు

పీలేరు, ఏప్రిల్ 15: త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయం సాధించిన వెంటనే రాష్ట్రంలోని మహిళలు మహారాణులు కాగలరని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి, ఆయన కుమార్తె వైష్ణవీ రెడ్డి తెలిపారు. కిశోర్ కుమార్ రెడ్డికి మద్దతుగా సోమవారం వారిద్దరు ఇంటింటి ప్రచా రం నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని, ఎంపీగా పోటీ చేస్తున్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, ఆయా పార్టీల అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ వస్తూనే బీసీ రక్షణ చట్టం


జయహో బీసీ సమావేశంలో టీడీపీ బీసీ విభాగం అధ్యక్షుడు నాగయ్య తదితరులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 16: రాష్ట్రంలో టీడీపీ అధి కారంలోకి వస్తూనే చంద్రబాబు బీసీలకు రక్షణ చ ట్టం తీసుకొస్తారని మదనపల్లె నియోజకవర్గ టీడీపీ బీసీ విభాగం అధ్యక్షుడు ఎం.నాగయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చీకిలబైలు పంచాయతీ పోలావారిపల్లెలో జయహో బీసీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రజక ఐక్యవేదిక అధ్యక్షుడు, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు నాగయ్య మాట్లాడుతూ జగన్ పాలనలో బీసీలు, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కరువైందన్నారు. అందుకే ఎన్‌డీఏ కూటమి అభ్య ర్థులైన మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి షాజహా న్‌బాషాను, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రజక సాధికార కమిటీ సభ్యుడు రామ్మూర్తి, నాగరాజు, గోపాలు, చంద్రశేఖర్, మహిళలు పాల్గొన్నారు.